ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కర్నూలు
జిల్లా వార్తలు 5

మంగళవారం 4 ఫిబ్రవరి 2025





ఆదిదేవ.. నమస్తుభ్యం..!

- సూర్యనారాయణ స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు
- నేడు సూర్యభగవానుడి జయంతి




ముల్లోకాల్లో ఉన్న దేవుళ్లలో మన కంటితో చూడగలిగేది సూర్యుడిని మాత్రమే. అందుకే సూర్యుడిని ప్రత్యక్ష దైవమని పిలుస్తారు. రథసప్తమి రోజు ప్రత్యేకంగా సూర్యుడికి పూజ చేస్తారు. ప్రతి ఏటా మాఘ శుద్ధ సప్తమిని రథసప్తమిగా నిర్వహించుకుంటాం. ఇదే రోజున సూర్య భగవానుడు జన్మించాడని అంటారు. సూర్య భగవానుడు మనకు ఆరోగ్యాన్ని ప్రసాదించే దేవుడు. భూమిపై ఉన్న జీవరాశులను కాపాడే దేవుడు. సూర్యుడే ఎండను ఇవ్వకపోతే పంటలు పండక ఎన్నో రకాల ఆరోగ్య సమస్యల బారిన పడి జీవరాశి అంతరించిపోయేది. అందుకే సూర్యుడిని దైవంగా పూజిస్తాం. సూర్య భగవానుడు దక్షిణాయణం నుంచి ఉత్తరాయణంలోకి ప్రవేశించే సమయంలో రెండు పర్వదినాలు ఘనంగా జరుపుకుంటారు. అందులో మొదటిది మకర సంక్రాంతి కాగా, రెండోది రథసప్తమి. మంగళవారం రథ సప్తమి వేడుకకు సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలో గుత్తిరోడ్డు సమీపంలో సూర్యనారాయణ స్వామి ఆలయ నిర్మాణం ఆకట్టుకుంటోంది. రాయలసీమలోనే మొదటిదిగా, రాష్ట్రంలో ఆరసవెల్లి తర్వాత రెండోదిగా ప్రసిద్ధి చెందిన ఈ ఆలయం నిత్య పూజాది కార్యక్రమాలతో విరాజిల్లుతూ ఉంటుంది. మైసూరు దత్తపీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ చేతుల మీదుగా ప్రారంభమైన ఈ క్షేత్రం రోజురోజుకూ పెరుగుతున్న భక్తులతో నిత్యకల్యాణం పచ్చతోరణంగా శోభిల్లుతోంది. 2005లో నగర శివారులోని గుత్తిరోడ్డులో గణపతి సచ్చిదానంద స్వామీజీ భక్తులు దత్తపీఠం ఆశ్రమాన్ని నెలకొల్పారు. ఆయన ఆశీస్సులతో 2014 ఫిబ్రవరి మాసంలో రథ సప్తమి రోజునే స్వామీజీ ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. 2019 ఫిబ్రవరి వసంత పంచమి రోజున గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆలయాన్ని ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు ఈ ఆలయంలో నిత్య పూజలు, హోమాలు జరుగుతూనే ఉన్నాయి.



సూర్యనారాయణుడిని పూజిస్తే సకల సౌభాగ్యాలు



ప్రపంచానికి వెలుగును ప్రసాదించే సూర్య భగవానుడిన ఆరాధిస్తే సకల సౌభాగ్యాలు కలుగుతాయి. ఉత్తరాయన పుణ్యకాలంలో మొదటి శుక్లపక్ష సప్తమి రోజున రథసప్తమి వస్తుంది. ఇహానికి, పరానికి కావలసినవి అందిస్తున్న ఆ దినకరునిడి పూజిస్తే సకల సౌభాగ్యాలు లభిస్తాయి. ఉత్తరాయన పుణ్యకాలంలో మనకు వచ్చే మొదటి శుక్లపక్ష సప్తమి రోజున రథసప్తమి వస్తుంది.ఆరోజున సూర్యుడిని పూజించే ఉత్తమ ఫలితాలు లభిస్తాయి.

- సుబ్రహ్మణ్య శర్మ, ఆలయ ప్రధాన అర్చకుడు

ఏర్పాట్లు పూర్తి చేశాం



సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో ప్రస్తుతం ఆరో వార్షికోత్సవ వేడుకలు సోమవారం నుంచి బుధవారం వరకు నిర్వహిస్తున్నాం. రథ సప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు ఉంటాయి. 7 గంటలకు సూర్యనారాయణ స్వామి స్పటికములకు భక్తాదులు స్వయంగా అభిషేకము చేసే అవకాశం కల్పించాం. ఉదయం 10 గంటలకు అరుణ హోమము, సూర్య పంచాతన హోమము, మహా పూర్ణాహుతి అనంతరం ప్రసాద వితరణ ఉంటుంది. సాయంత్రం 6 గంటలకు హైదరాబాదుకు చెందిన డాక్టర్ దీక్షితుల సుబ్రహ్మణ్యంచే భక్త గాన లహరి కార్యక్రమం ఏర్పాటు చేశాము.

- టీఎస్ రామకృష్ణ, దేవస్థానం అధ్యక్షుడు


నీటి విడుదలకు వసూళ్లు

- హంద్రీ నీవా పరిధిలో ఇంజనీర్లు, వైసీపీ నాయకుల అక్రమాలు
- ఇదెక్కడి న్యాయం అంటున్న రైతులు
- అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం

కరువు పల్లెల కన్నీటి' కష్టాలు తీర్చడానికి కృష్ణా జలాలను అందిస్తున్నారు. హంద్రీనీవా కాలువ ద్వారా ఎత్తిపోసే ఒక టీఎంసీ నీటికి రూ.25 కోట్లకు పైగా కరెంటు బిల్లు ఖర్చవుతుంది. దీనిని అవకాశంగా మార్చుకొని గత వైసీపీ పాలనలో కొందరు ఇంజనీర్లు, ఆ పార్టీ నాయకులు కన్నీటి'లో కాసుల వేటకు సిద్ధపడ్డారు. రైతులు నుంచి అక్రమంగా రూ.లక్షలు వసులు చేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక నిజాయితీగా రైతులకు నీళ్లు ఇవ్వాలని ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. ఇందుకు విరుద్ధంగా హంద్రీనీవా కాలువ పరిధిలో ఒకరిద్దరు ఇంజనీర్లు వైసీపీ నేతలతో కుమ్మక్కై అక్రమ వసుళ్లకు పాల్పడడం విమర్శలకు తావిస్తున్నది. దీనిపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ఎస్ఈ వరప్రసాద్ వివరించారు.




పందికోన జలాశయం



కర్నూలు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో హంద్రీనీవా ఎత్తిపోతల పథకం ద్వారా 80 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి ఉంది. అందులో భాగంగానే పత్తికొండ (పందికోన) జలాశయం కుడి (రైట్ బ్యాంక్) కాలువ కింద 50,626 ఎకరాలకు, ఎడమ (లెఫ్ట్ బ్యాంక్) కాలువ కింద 10,774 ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి ఉంది. కుడి కాలువ పరిధిలో ప్యాకేజీ-28 కింద జిలేడబుడకల, కరివేముల, కప్పట్రాళ్ల, ప్యాలకుర్తి, తెర్నేకల్లు, నేలబండ, కోటకొండ, నేరుడుపల్లి, గోనెగండ్ల మండలం ఎర్రబాడు, తిప్పనూరు గ్రామాలలో దాదాపుగా 29,200 ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి ఉంది. 9 చెరువులకు కృష్ణా జలాలు మళ్లించాలి. వేసవి కాలం రాబోతుండడంతో రైతులు, పశువులకు సాగు, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చెరువులు హంద్రీనీవా నీటితో నింపాలని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, పాణ్యం గౌరు చరిత, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిలు హంద్రీనీవా ఇంజనీర్లను కోరారు. మూడు నాలుగు రోజుల క్రితం ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి గోనెగండ్ల మండలంలోని చెరువులను తక్షణమే నింపాలని, నేనే స్వయంగా చెరువుల వద్దకు వెళ్తానని హంద్రీనీవా ఇంజనీర్లను ఆదేశించారు. గోనెగండ్ల మండలం ఎర్రబాడు సహా వివిధ చెరువులు నింపాలని హంద్రీనీవా ప్రాజెక్టు కర్నూలు సర్కిల్ ఎస్ఈ వరప్రసాద్ సంబంధిత ఇంజనీర్లకు ఆదేశించారు. అందులో భాగంగానే పత్తికొండ రిజర్వాయర్ కుడి కాలువ 3.500 కిలోమీటర్ల దగ్గర రైట్‌సైడ్ స్లూయిస్ ద్వారా చెరువులకు నీరు విడుదల చేస్తున్నారు.

రైతుల నుంచి అక్రమ వసుళ్లు

హంద్రీనీవా కాలువ ద్వారా చెరువులకు నీరు మళ్లించడం ఇంజనీర్ల బాధ్యత. అయితే.. కొందరు ఇంజనీర్లు వైసీపీ నాయకులతో కుమ్మక్కై నీటి విడుదల పేరిట అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. అధికార టీడీపీ కూటమి నాయకులు డబ్బులు ఇవ్వరు.. ఎమ్మెల్యేల ద్వారా ఫోన్లు చేయిస్తారు అనుకున్నారో ఏమో..? ఇంజనీర్లకే ఎరుక. ప్రతిపక్ష వైసీపీ నేతల ద్వారా ఎకరాకు రూ.500 నుంచి రూ.వెయ్యి ప్రకారం వసులు చేయడం విమర్శలకు తావిస్తున్నది. గోనెగండ్ల మండలం ఎర్రబాడు గ్రామం రైతుల నుంచి రూ.లక్షల్లో వసులు చేసినట్లు సమాచారం. దీని వెనుక ఓ డీఈఈ పాత్ర ఉందనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఇలా వసులు చేసిన డబ్బును కోడుమూరులో పంపకాలు చేశారని అంటున్నారు. ఎర్రబాడు ఒక్కటే కాదు.. ఇతర గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉన్నట్లు సమాచారం. కరువుతో తల్లడిల్లుతున్న కష్టజీవుల కన్నీళ్లు తుడవాల్సిన అధికారులే రాజకీయ నాయకులతో కుమ్మక్కై చెరువులకు నీళ్ల విడుదల పేరిట అక్రమ వసులకు పాల్పడడం విమర్శలకు తావిస్తున్నది. ఈ విషయం తెలిసి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.



విచారించి చర్యలు తీసుకుంటాం

గోనెగండ్ల మండలం ఎర్రబాడు గ్రామం చెరువుకు హంద్రీనీవా కాలువ నుంచి నీరు విడుదల చేశాం.. చెరువుకు నీరు ఇచ్చేందుకు ఇంజనీర్లు, సిబ్బంది రైతుల నుంచి అక్రమ వసులు చేశారనే ఆరోపణలు వచ్చిన మాట నిజమే. క్షేత్రస్థాయిలో సమగ్రంగా విచారించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాం. శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం కరువు రైతులకు నీరు ఇవ్వాలనే సంకల్పంతో రూ. కోట్లు విద్యుత్ బిల్లుల రూపంలో ఖర్చు చేసి కృష్ణా జలాలు ఎత్తిపోస్తున్నది. రైతులు ఎవ్వరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు. నీటి విడుదల కోసం ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే రాతపూర్వకంగా మా దృష్టికి తీసుకరావచ్చు. వారిపై చర్యలు తీసుకుంటాం.

- వరప్రసాద్, ఎస్ఈ, హంద్రీ నీవా ప్రాజెక్టు కర్నూలు సర్కిల్

గడువులోగా అర్జీలను పరిష్కరించండి

జాయింట్ కలెక్టర్ నవ్య



అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ నవ్య

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 3: (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం ద్వారా జాయింట్ కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జాయింట్ కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. పీజీఆర్ఎస్‌కు సంబంధించి రీఓపెన్ కేసుల మీద ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డిప్యూటీ ఇన్‌సెక్టర్ ఆఫ్ సర్వే, ఆదోని వద్ద 51, పత్తికొండ ఆర్డీవో 39, కర్నూలు ఆర్డీవో 34, ఆదోని ఆర్డీవో 29, డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ సర్వే కర్నూలు 24 రీఓపెన్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయనీ వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. 22ఏ గ్రీవెన్స్‌లు జిల్లాలో సుమారు 326 ఓపెన్ అయ్యాయనీ, అందులో క్రిష్ణగిరి తహసీల్దార్ వద్ద 76, గోనెగండ్ల తహసీల్దార్ 68, ఎక్కువ శాతం ఓపెన్ అయ్యాయన్నారు. సాధ్యమైనంత త్వరలో సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

రైల్వే స్టేషన్లకు మహర్దశ

- ఇప్పటికే కర్నూలు సిటీ, ఆదోని స్టేషన్లలో పనులకు శ్రీకారం
- వివిధ దశల్లో నిర్మాణాలు
- మహబూబ్‌నగర్-డోన్ వయా కర్నూలు మధ్య డబ్లింగ్
- ఉమ్మడి జిల్లాకు ఆశాజనకంగా నిధులు వచ్చే అవకాశం
- బడ్జెట్ ముఖ్య అంశాలు వెల్లడించిన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్




కర్నూలు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ రైల్వే ప్రాజెక్టులకు రూ.9,417 కోట్లు 2025-26 బడ్జెట్‌లో కేటాయింపులు చేశామని రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ సోమవారం వెల్లడించారు. ఏ ప్రాజెక్టుకు ఎంత నిధులు ఇచ్చారో స్పష్టత ఇవ్వలేదు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా ఎంపికైన జిల్లాలో కర్నూలు సిటీ, ఆదోని రైల్వే స్టేషన్ల ఆధునికీకరణకు నిధులు ఇచ్చారు. మహబూబ్ నగర్-డోన్ వయా కర్నూలు రైల్వేలైన్ డబ్లింగ్, విద్యుద్ధీకరణకు కూడా నిధులు కేటాయించినట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు. కర్నూలు నగరవాసుల చిరకాల స్వప్నమైన వెంకటరమణ కాలనీ వైపు రెండు ప్రధాన ద్వారం (సెంకెడ్ గేట్), మొదటి ప్రధాన ద్వారం (ఫస్ట్ గేట్) ఆధునికీకరణ పనులు మొదలయ్యాయి. తాజా బడ్జెట్‌లో ఆశాజనకంగా నిధులు కేటాయించడంతో పనులు వేగంగా జరుగుతాయని రైల్వే అధికారులు అంటున్నారు.

మిగతా 6వ పేజీలో

సమస్యలెన్నో..!

- పోలీసు శాఖలో ఇంకా వైసీపీ మూలాలే
- సెటిల్మెంట్లకు అడ్డాగా పోలీస్ స్టేషన్లు
- ఉనికి కోల్పోయిన క్రైం పార్టీ, సీసీఎస్
- జిల్లాలో జోరుగా పేకాట, మట్కా
- పెరిగిన సైబర్ క్రైం, దొంగతనాలు
- కేసులు నమోదు చేయని పోలీసులు
- ట్రాఫిక్‌లో సిబ్బంది కొరత



కర్నూలు క్రైం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఎనిమిద నెలలవుతున్నా పోలీసు శాఖలో ఇంకా మార్పులు రాలేదు. వైసీపీ ప్రభుత్వంలోని విధానాలను ఇంకా అనుసరిస్తున్నారు. జిల్లాలో ఉన్న పోలీస్‌స్టేషన్లన్నీ సెటిల్మెంట్లకు అడ్డాగా మారాయి. సైబర్ క్రైం, దొంగతనాలు పెరిగిపోతున్నా పోలీసు శాఖ మాత్రం నిర్లిప్త ధోరణితో వ్యవహరిస్తోంది. అనుభవం, సామర్థ్యం లేని కొంత మంది పోలీసు అధికారులకు పోలీస్‌స్టేషన్లు అప్పజెప్పడం ఈ సమస్యకు మరింత ఆజ్యం పోసింది. కొన్ని గ్రామాలు నివురుగప్పిన నిప్పులా ఉన్నాయి. పోలీసు శాఖలోని ప్రధాన విభాగాల్లో వైసీపీ ప్రభుత్వం హయాంలో కీలక పాత్ర పోషించిన పోలీసు అధికారులే ప్రధాన విభాగాల్లో ఉండటం విశేషం. వైసీపీ ఎమ్మెల్యే టికెట్ ఆశించిన కొంత మంది పోలీసులు ప్రస్తుతం తమ హవానే కొనసాగిస్తున్నారు. మట్కా, పేకాట నగరం నడిబొడ్డులో విచ్చలవిడిగా జరుగుతున్నా స్థానిక పోలీసులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీసు శాఖను గాడిలో పెడతారో లేదో వేచి చూడాల్సిందే.

సెటిల్మెంట్ల అడ్డాగా పోలీస్ స్టేషన్లు


కూటమి ప్రభుత్వం వచ్చి 8 నెలలైనా కూడా కొన్ని పోలీస్‌స్టేషన్లలో పరిస్థితి మారలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎలాంటి సెటిల్మెంట్లు చేశారు. ఇప్పుడు కూడా అవే కొనసాగిస్తున్నారు. ప్రతి రోజూ ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఒకటో రెండో భూ సమస్యలు, భూ కబ్జాలు లాంటి కేసులే. ఇది పోలీసు అధికారులకు వరంగా మారాయి. రాజకీయ నాయకుల అండదండలతో కొంత మంది పోలీసులు భూకబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నారు. జిల్లాలో ప్రధాన నగరాలైన ఆదోని, కర్నూలులో మట్కా పేకాట జోరుగా సాగుతున్న నివారించేందుకు చర్యలు తీసుకోవం లేదు. ఇటీవల త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట స్థావరంపై ఎస్పీకి చెందిన స్పెషల్ పార్టీ బృందం దాడులు చేసి భారీ ఎత్తున పట్టుకుంది. నిందితులను పట్టుకునేంత వరకు త్రీటౌన్ పోలీసులకు తెలియకపోవడం విశేషం. సంఘటన జరిగిన రోజుకు ముందు 8 రోజుల నుంచే వారుపెద్ద ఎత్తున పేకాట స్థావరం నిర్వహిస్తున్నట్లు వారి విచారణలో వెల్లడైంది. చీటింగ్‌లు, భూతగాదాలు, సైబర్ క్రైమ్, ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసాలు, కుటుంబ కలహాలు ఇలాంటి చిన్న చిన్న సమస్యలు కూడా పోలీస్‌స్టేషన్‌లలో పరిష్కరించలేకపోతున్నారు.

దొంగల పట్ల నిర్లక్ష్యం

జిల్లాలో జరుగుతున్న దొంగతనాలను అరికట్టడంలో, దొంగలను పట్టుకోవడంలో, దొరికిన దొంగల నుంచి రికవరీ చేయడంలో పోలీసులు అనుసరిస్తున్న విధానాలు ఆ శాఖకు మచ్చ తెచ్చిపెడుతున్నాయి. ఎక్కడా విజిబుల్ పోలీసింగ్, రాత్రి గస్తీ కనిపించడం లేదు. దొంగలు పట్టుకున్న తర్వాత వారి నుంచి రికవరీ చేయించడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండేళ్లుగా 50 దొంగతనాలు చేసిన ఓ నిందితున్ని పట్టుకోలేకపోయారంటే వారి సామర్థ్యం ఏ పాటిదో ఊహించుకోవచ్చు. ఆ పట్టుకున్న నిందితున్ని 15 రోజులు తన కస్టడీలో ఉంచుకున్న సీఐ రికవరీ చేయించడంలో చేతులెత్తేశాడు. తీరా నిందితులు కోర్టుకు వెళితే.. సెర్చ్ వారంట్ రావడంతో చాకచక్యంగా వ్యవహరించలేక ఆ నిందితుడిని వదిలేశాడు. ఇలా సెర్చ్ వారెంట్‌తో నిందితులను వదిలేసిన ఘటనలు రెండు మూడు నెలల్లో ఐదారు జరిగాయంటే పోలీసుల సామర్థ్యం ఏంటో అర్థం చేసుకోవచ్చు. కర్నూలు ఆర్టీసీ బస్టాండు సిద్ధాపురం గ్యాంగ్‌కు అడ్డాగా మారింది. బస్ స్టేషన్‌లో ఒకరు, లేదా ఇద్దరు మాత్రమే అప్పుడప్పుడు విధులు నిర్వర్తించడం గమనార్హం. అంత ఆదాయం వచ్చే ఈ ఆర్టీసీ బస్టాండులో కేవలం 7 లేదా 8 సీసీ కెమెరాలు మాత్రమే ఉన్నాయి. నేరాలను అరికట్టడం, నేరస్థులను పట్టుకోవడానికి క్రైం పార్టీ, సీసీఎస్ పోలీసులను ఉపయోగించుకోవడం లేదు. తమ వసూళ్లకు అడ్డాగా క్రైం పార్టీ పోలీసులను వినియోగిస్తున్నారనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి.

ప్రతిరోజూ సైబర్ క్రైమ్ ఫిర్యాదులే

జిల్లాలో సైబర్ క్రైం నేరాలు విపరీతంగా పెరిగిపోయాయి. గతంలో లింక్‌ను క్లిక్ చేస్తే డబ్బులు మాయమయ్యాయి. ప్రస్తుతం ఫోన్‌లో మాట్లాడితే కూడా డబ్బులు మాయమైన ఘటనలు అనేకం. సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కల్పిస్తున్నా సైబర్ నేరాల బారిన పడిన బాధితులకు స్వాంతన లభించడం లేదు. డబ్బులు పోగొట్టుకున్న బాధితులు పోలీస్‌స్టేషన్లకు వెళితే కేసులు నమోదు చేయడం లేదు. కేసులు నమోదు చేసినా రికవరీలు అంతంత మాత్రమే. ప్రతి సోమవారం ఎస్పీ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వస్తున్న ఫిర్యాదుల్లో ఎక్కువ భాగం సైబర్ మోసాలు ఉన్నాయి. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ ఈ సైబర్ నేరాలను ఎలా గాడి పెడుతారో చూడాలి.



చిక్కుముడి వీడని ట్రాఫిక్ సమస్య

కర్నూలు, ఆదోనిలో ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. గత కొన్నేళ్లుగా ట్రాఫిక్ సమస్య పరిష్కరిస్తామని ప్రతి ఎస్పీ బాధ్యతలు తీసుకున్న కొత్తలో చెబుతూనే ఉన్నారు. ఆ తర్వాత కొంత కాలానికి ఆ సంఘటన మరిచిపోతున్నారు. ఆటో డ్రైవర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆకతాయిలు బైక్ విన్యాసాలు చేస్తూ తోటి వాహనచోదకులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. గతంలో కొంత మంది పోలీసు అధికారులు నగరంలో పలుకూడళ్లలో అభివృద్ధి చేశారు. అత్యాధునిక సీసీ కెమెరాలు, సిగ్నల్స్ ఏర్పాటు చేయించారు. ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్‌ను రూపొందించారు. అయినా ట్రాఫిక్ నియంత్రణలో అటు ఆర్‌అండ్‌బీ, ఇటు మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకోవడంలో పోలీసు శాఖ విఫలమైంది. ఏ శాఖకు ఆ శాఖనే సొంత నిర్ణయాలు తీసుకుంటూ కొన్ని కూడళ్లలో ట్రాఫిక్ సమస్యను మరింత జటిలం చేశారు. కొన్ని కూడళ్లలో సీసీ కెమెరాలు ఉన్నా వాటిని ఉపయోగించుకుని ట్రాఫిక్ కంట్రోల్ చేసిన దాఖలాలు కనిపించలేదు.

యువ

విశ్వవిజేత స్థాయికి పేపర్ బాయ్

- తల్లి చదివించింది.. కొడుకు సాధించాడు
- సెపక్‌తక్రా క్రీడతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం
- శివకుమార్ విజయ ప్రస్థానం స్ఫూర్తిదాయకం



థాయ్‌లాండ్‌లో జరిగిన పోటీలో పాల్గొన్న శివ (ఫైల్)

నంద్యాల వైద్యం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తండ్రి చిన్న తనంలోనే చనిపోయాడు.. ముగ్గురు కుమారులను కష్టపడి పోషించింది. ఆమె కష్టాన్ని కుమారులు వృథా పోనివ్వలేదు. సెపక్‌తక్రా క్రీడనే నమ్ముకున్న ఆ కుటుంబం వారి జీవనోపాధికి బాటలు వేసింది. పేపర్ బాయ్ నుంచి ప్రపంచ కప్ దాకా ఎదిగిన ఆ అంతర్జాతీయ క్రీడాకారుడి విజయ ప్రస్థానం ఇది. కర్నూలుకు చెందిన సరస్వతి, ఎర్రన్నలకు ముగ్గురు కుమారులు. ఎర్రన్న రుమాల్‌రోటీ తయారు చేయడంలో సిద్ధహస్తుడు. చెఫ్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. అనివార్య కారణాల వల్ల 2014లో అనారోగ్యం పాలై ఎర్రన్న మృతి చెందడంతో తల్లి సరస్వతిపై కుటుంబ భారం పడింది. కుటుంబం ఆర్థిక పరిస్థితులు తెలుసుకున్న ముగ్గురు పిల్లలు అశోక్‌కుమార్, శివకుమార్, చిరులు తల్లికి చేదోడువాదోడుగా ఉండేవారు. రెండవ కుమారుడైన శివకుమార్ తండ్రి బాటలో పయనిస్తూ పార్ట్‌టైమ్‌గా ఉదయం పేపర్‌బాయ్‌గా పనిచేస్తూ అనంతరం మైదానంలో సెపక్‌తక్రా క్రీడను సాధన చేసేవాడు. పనులు చేసుకుంటూ ఆట ఆడుతూ బి.కామ్ పూర్తి చేశాడు. చిన్నప్పుడు చేసిన కఠోర సాధన నేడు అంతర్జాతీయ స్థాయిలో భారతదేశానికి బంగారు పతకాలను తెచ్చిపెడుతోంది. అన్న అశోక్‌కుమార్ కూడా సెపక్‌తక్రా క్రీడలో ప్రతిభ కనబరచి స్పోర్ట్స్ కోటాలో హైదరాబాద్‌లో పోస్టల్ శాఖలో ఉద్యోగం సాధించాడు. తమ్ముడు చిరు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. శివకుమార్ సెపక్‌తక్రాలో దాదాపు 20కిపైగా రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి చాంపియన్‌షిప్‌లో పాల్గొన్నాడు. అయిదు సార్లు అంతర్జాతీయ స్థాయిలో భారతదేశం తరఫున ప్రాతినిథ్యం వహించాడు. 2024 జూలైలో ముంబైలో ఇన్‌కంట్యాక్స్ ఇన్‌స్పెక్టర్‌గా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించాడు. ఈ ఉద్యోగానికి దాదాపు 10వేల మంది క్రీడాకారులు దరఖాస్తు చేసుకోగా అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించడంతో కొలువు శివకుమార్‌ను వరించింది.

అన్న స్ఫూర్తితోనే..

సెపక్‌తక్రా క్రీడలో అన్న అశోక్‌కుమార్ స్ఫూర్తితో, కార్యదర్శి శ్రీనివాసులు ప్రోత్సాహంతో అంతర్జాతీయ స్థాయికి ఎదిగాను. రెండు సార్లు రాష్ట్ర మంత్రి టీజీ భరత్ అంతర్జాతీయ పోటీలకు ఆర్థిక సహాయం అందించారు. సెపక్‌తక్రాలో ఓనమాలు నేర్పింది పీఈటీ కిశోర్. ఏషియన్ గేమ్స్‌లో మెడల్ సాధించడమే లక్ష్యం. బీపీడీ, ఎంపీడీ పూర్తి చేసి ఉద్యోగ అన్వేషణలో ఉండగా నోటిఫికేషన్ రావడం.. దరఖాస్తు చేసుకోవడం.. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం రావడం నేను ఊహించలేదు. క్రీడాకారులు కష్టపడి సాధన చేస్తే ఫలితం తప్పకుండా దక్కుతుందనేదానికి నేనే నిదర్శనం.

\- సి.శివకుమార్, అంతర్జాతీయ క్రీడాకారుడు

అంతర్జాతీయ పోటీల్లో ఇలా..

- 2022లో సీనియర్ రెగు వరల్డ్ చాంపియన్‌షిప్ బ్యాంకాక్‌లో గోల్డ్‌మెడల్
- 2023లో సీనియర్ క్వాడ్ విభాగంలో బ్యాంకాక్‌లో జరిగిన వరల్డ్ చాంపియన్ షిప్‌లో బ్రాంజ్‌మెడల్
- 2023లో చైనాలో జరిగిన 19వ ఏషియన్ గేమ్స్‌లో క్వాడ్ విభాగంలో ఇండియా జట్టుకు ప్రాతినిధ్యం
- 2024లో సౌత్ ఏషియన్ చాంపియన్‌షిప్‌లో మూడు బంగారు పతకాలు
- 2024లో థాయ్‌లాండ్‌లో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఇండియా జట్టుకు ప్రాతినిధ్యం


సౌత్ ఏషియన్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకంతో శివ (ఫైల్)

25 నుంచి కాల్వబుగ్గ బ్రహ్మోత్సవాలు


ఉత్సవాల లగ్నపత్రికను ఈవోకి అందజేస్తున్న అర్చకులు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన కాల్వబుగ్గ రామేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 25 నుంచి మార్చి 2వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో మద్దిలేటి తెలిపారు. సోమవారం ఆలయ ప్రధానార్చకులు కల్లె లక్ష్మీనారాయణ శర్మ, కల్లె నరసింహశర్మ ఆధ్వర్యంలో మహా శివరాత్రి ముహూర్తాన్ని ఖరారు చేశారు. ఈ నెల 25 నుంచి మార్చి 2వ తేదీ వరకు కాల్వబుగ్గలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని తెలిపారు. 25న మంగళవారం బుగ్గ రామేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు కాల్వ గ్రామం నుంచి కాల్వబుగ్గకు ప్రయాణం, 26న బుధవారం అంకురార్పణ, ధ్వజారోహణం, పగలు బుగ్గ రామేశ్వరస్వామి, భ్రమరాంబదేవికి పంచామృతాభిషేకం, రాత్రి స్వాములవారికి గ్రామాభిషేకం, 27వ తేదీ గురువారం తెల్లవారుజామున స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం, అదే రోజు నందివాహన సేవ, సాయంత్రం 5 గంటలకు ప్రభోత్సవం, 28న శుక్రవారం సాయంత్రం 5 గంటలకు రథోత్సవం, మార్చి 1న శనివారం ఉదయం వసంతోత్సవం, సాయంత్రం పారువేట, మార్చి 2వ తేదీ ఆదివారం పంచామృతాభిషేకం బుగ్గరామేశ్వరస్వామి ఉత్సవ మూర్తులు కాల్వగ్రామానికి తిరుగు ప్రయాణం వేడుకలు ఉంటాయని తెలిపారు. మాజీ చైర్మన్లు చంద్రపెద్దస్వామి, జీకే సుధాకర్, భక్తులు కాటినేని నారాయణ, కాకి దేవేంద్ర, ఆకుల మహేష్, కేవీ మధు, మహబూబ్ బాషా, బజారు, నాగరాజు, జయకృష్ణ, గువ్వ రవికుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్లకు మహర్దశ..!

(5వ పేజీ తరువాయి)

అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రాష్ట్రంలో 73 రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధి చేపట్టామని రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్ వెల్లడించారు. అందులో కర్నూలు సిటీ, ఆదోని కూడా ఉన్నాయి. దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ పరిధిలో ముఖ్యమైన రైల్వే స్టేషన్‌లో కర్నూలు ఒకటి. స్వాతంత్ర్యానికి పూర్వమే 1905లో ప్రారంభించారు. 120 ఏళ్ల చరిత్ర కలిగిన స్టేషన్ ఇది. 2013-14లో కర్నూలు సిటీ రైల్వే స్టేషన్‌గా మార్చారు. అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథకం కింద రూ.42.6 కోట్లు మంజూరు చేశారు. 2023 ఆగస్టులో ప్రధాని మోదీ వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేశారు. రైల్వే స్టేషన్ వెనుకు వైపు వెంకటరమణ కాలనీ, అశోక్‌నగర్, లేబర్‌కాలనీ, సంతోష్ నగర్, బాలజీ నగర్, కప్పలనగర్.. వంటి కాలనీలు విస్తరిస్తున్నాయి. నగరం అటువైపు రోజురోజకు విస్తరిస్తుంది. ఆయా ప్రాంతాలకు చెందిన రైల్వే ప్రయాణికులు స్టేషన్‌కు రావాలంటే అశోక్‌నగర్ వద్ద నున్న రైల్వే లైన్ అండర్ బిడ్జి దిగువ నుంచి లేదంటే ఆర్టీసీ బస్టాండ్ మీదుగా ఐదు రోడ్ల కూడలి మీదుగా రావాలి. వర్షం వస్తే రైల్వే లైన్ అండర్ బిడ్జిలో వర్షపు నీరు నిండిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంకటరమణ కాలనీ వైపు ఓ ద్వారం (సెకండ్ ఎంట్రీ గేట్) ఏర్పాటు చేయాలని ప్రయాణీకులు ఎన్నో ఏళ్లుగా విన్నవిస్తున్నారు. అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథకంలో భాగంగా సెకండ్ ఎంట్రీ గేట్ ఏర్పాటు చేస్తున్నారు. పునరుద్ధరణ పనుల్లో ఇది ఎంతో కీలకమైనది. ప్రయాణీకుల అభిరుచులకు అనుగుణంగా అత్యాధునిక హంగులతో రెండో ద్వారం నిర్మాణం పనులు మొదలు పెట్టారు. అలాగే రెండో ముంబాయిగా ఖ్యాతిగాంచిన ఆదోని రైల్వే స్టేషన్‌కు ఎంతో చరిత్ర ఉంది. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఎంపిక చేసి రూ.11.50 కోట్లతో పనులు మొదలు పెట్టారు. తాజాగా బడ్జెట్‌లో నిధులు ఇవ్వడంతో ఈ పనులు మరింత వేగంగా పూర్తి చేయడానికి అవకాశం ఉందని రైల్వే అధికారులు పేర్కొంటున్నారు.



ఆదోని రైల్వే స్టేషన్

మహబూబ్‌నగర్-డోన్ మధ్య డబ్లింగ్‌కు పచ్చజెండా

మహబూబ్‌నగర్ - డోన్ వయా గద్వాల, కర్నూలు, వెల్దుర్తి 197 కి.మీల డబ్లింగ్ రైల్వే లైన్ నిర్మాణం, విద్యుద్ధీకరణ చేపట్టాలని ఎన్నో ఏళ్లుగా రైల్వే ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. గతేడాది నవంబరులో రూ.2,208 కోట్లతో చేపట్టే పనులకు ప్రధాని మోదీ విశాఖ కేంద్రంగా వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేశారు. ఈ మార్గం నిర్మాణం పూర్తయితే రెండు తెలుగు రాష్ట్రాల రైల్వే ప్రయాణికులకు ప్రయోజనకరంగా ఉంటుంది. కర్నూలు, నంద్యాల జిల్లాలో 54 కి.మీలు, తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల జిల్లాల పరిధిలో 143 కిలోమీటర్ల డబ్లింగ్ రైలు మార్గం నిర్మించనున్నారు. తాజా బడ్జెట్‌లో అవసరమైన మేరకు నిధులు కేటాయింపులు చేశారని అధికారులు తెలిపారు.

దళారుల చేతుల్లో మోసపోవద్దు: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

ఓర్వకల్లు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రైతులు దళారుల చేతుల్లో మోసపోవద్దని, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే కందులు కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని ఎమ్మెల్యే గౌరు చరిత సూచించారు. సోమవారం ఓర్వకల్లులోని సహకార పరపతి సంఘం కార్యాలయంలో కంది కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కందులకు ప్రభుత్వం క్వింటంకు రూ.7,550 మద్దతు ధర కల్పించిందన్నారు. కందుల్లో 12 శాతం కంటే తక్కువగా తేమ ఉండాలన్నారు. అలాగే మండలంలో రైతులు సాగు చేసిన పొగాకు పంటకు కంపెనీలు మద్దతు ధర కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తిప్పన్న, ఎంపీడీవో శ్రీనివాసులు, సర్వే డీటీ షర్మిళ రెడ్డి, నాయకులు గోవిందరెడ్డి, మోహన్ రెడ్డి, రాంభూపాల్ రెడ్డి, సుధాకర్‌రావు, లక్ష్మీకాంతరెడ్డి, భాస్కర్ రెడ్డి, ఏవో సుధాకర్, సీఈవో మద్దిలేటి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పారిశ్రామికవేత్తలకు అవగాహన సదస్సు

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఈ నెల 5 నుంచి 7 వరకు 3 రోజుల పాటు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు వ్యాపార నిర్వహణ శక్తి సామర్థ్యాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆనంద్ రాజ్‌కుమార్ తెలిపారు. నగరంలోని బిర్లాగేట్ సమీపంలోని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ సంకల్ప్ పథకంలో భాగంగా నిర్వహించే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పారిశ్రామికవేత్తలు ఎదగడానికి కావాల్సిన మెలకువలు, వ్యాపారం చేసుకోవడానికి కావాల్సిన విధి విధానాలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 96761 41731 సంప్రదించాలని తెలిపారు.

జడ్పీలో కారుణ్య నియామకాలు

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పరిధిలో కారుణ్య నియామకం కింద నాల్గవ తరగతి ఉద్యోగులను నియమించారు. ఈ మేరకు సోమవారం జడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. జి. శ్రీనివాస సాయి నితిన్‌ను కౌతాళం ఎంపీడీఓగా, మస్తాన్ వలిని ఆళ్లగడ్డ ఎంపీడీఓగా, గోపీనాథ్‌ను గూడూరు ఎంపీడీఓగా, డి. వసిఫిక్‌ను పత్తికొండ ఎంపీడీఓగా, పి.డి. ప్రదీప్‌కుమార్‌ను పాములపాడు ఎంపీడీఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రూ.49 కోట్లతో బైపాస్ రోడ్డు

- 44 ఎకరాల భూ సేకరణ
- 45 మీటర్లు వెడల్పు, 4.5 కిలోమీటర్ల పొడవు
- మంత్రాలయంలో తీరనున్న ట్రాఫిక్ సమస్య


మంత్రాలయంలోని రాఘవేంద్ర సర్కిల్

మంత్రాలయం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చే వాహనాల ట్రాఫిక్ సమస్య తీరనుంది. దీని కోసం నేషనల్ హైవే అధికారులు రూ.49 కోట్లతో కల్లుదేవకుంట నుంచి చెట్నహల్లి మీదుగా బైపాస్ రోడ్డును నిర్మించేందుకు టెండర్లు పూర్తి చేశారు. ఏప్రిల్‌లో పనులు ప్రారంభానికి శ్రీకారం చుడుతున్నట్లు హైవే రోడ్డు ఈఈ శంకర్ రెడ్డి తెలిపారు. 45 మీటర్ల వెడల్పుతో 4.5 కిలోమీటర్ల పొడవున రెవెన్యూ అధికారులు అలైన్‌మెంటు పూర్తి చేశారు. ఎమ్మిగనూరు నుంచి వచ్చే 167 జాతీయ రహదారి కల్లుదేవకుంట దాటిన తర్వాత చెట్నహల్లి శివారులో కలిపేందుకు బైపాస్ రోడ్డుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇందులో చెట్నహల్లి గ్రామానికి చెందిన 16 మంది రైతుల 6.04 ఎకరాలు, మంత్రాలయం చెందిన 43 మంది రైతులు 16.98 ఎకరాలు, కల్లుదేవకుంట గ్రామానికి చెందిన 14 మంది రైతులకు చెందిన 6.37 ఎకరాలు, శ్రీరాఘవేంద్రస్వామి మఠానికి చెందిన 14.49 ఎకరాల భూములను అలైన్‌మెంట్ పూర్తి చేసి ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించారు. ఇందులో చెట్నహల్లి పరిధిలో 75 ప్లాట్లు సైతం బైపాస్ రోడ్డులో కోల్పోనున్నారు. ఈ బైపాస్ రోడ్డు పూర్తయితే మంత్రాలయం మీదుగా వచ్చే భారీ వాహనాలు, కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని బెంగుళూరు, తమిళనాడు, చెన్నై తదితర పట్టణాలకు వెళ్లే వాహనాలు బైపాస్ మీదుగా వెళతాయి. దీంతో రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు ట్రాఫిక్ సమస్య తీరుతుంది. ఎల్లప్పుడు మంత్రాలయంలో వాహనాల రద్దీని పోలీసులు కంట్రోల్ చేయలేకపోతున్నారు. రాఘవేంద్రసర్కిల్ ట్రాఫిక్‌తో పద్మవ్యూహంలా తయారైంది. ఈ బైపాస్ రోడ్డు పూర్తయితే మంత్రాలయానికి వాహనాల రద్దీ తగ్గుతుంది. ట్రాఫిక్ సమస్య తీరుతుంది. దీని కోసం భూములు కోల్పోయే రైతులు ఎకరా, అరెకరా పొలాలను, ప్లాట్లను నమ్ముకున్నవారి పరిస్థితి దయనీయంగా మారింది. అలైన్‌మెంట్‌ను మార్చి న్యాయం చేయాలని రైతులు రాఘవేంద్ర స్వామి మఠం అధికారులకు దరఖాస్తులు చేసుకున్నారు. కొంత మంది రైతులతో ఆదోన్ సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ రైతులతో చర్చలు జరిపి, రైతులకు రావాల్సిన నష్టపరిహారం త్వరలో ఇప్పించే ప్రయత్నాలు చేస్తున్నారు.

భూసేకరణ పూర్తి



రూ.49 కోట్లతో కల్లుదేవకుంట నుంచి గోశాల వెనుక భాగం మీదుగా చెట్నహల్లి వరకు 4.5 కిలోమీటర్లు పొడవున నిర్మించబోయే బైపాస్ రోడ్డుకు దాదాపు భూసేకరణ అలైన్‌మెంట్ పూర్తి చేశాం. కొంత మంది రైతులు అలైన్‌మెంటు మార్చాలని సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రైతులతో చర్చించి వారికి తగిన నష్టపరిహారాన్ని జిల్లా అధికారులు నిర్ణయిస్తారు. ఇప్పటికే రెండు, మూడు దఫాలుగా రైతులతో సబ్ కలెక్టర్ చర్చలు జరిపారు. ఏప్రిల్‌లో పనులు ప్రారంభించేందుకు హైవే రోడ్డు అథారిటీ సిద్ధమైంది.

\-ఎస్.రవి, తహసీల్దార్, మంత్రాలయం

రాఘవేంద్రుడిపై నెలవెంక

మంత్రాలయం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం గర్భగుడి స్వర్ణ శిఖర కలశంపై నెలవంక కనువిందు చేసింది. ఈ అద్భుత, ఆహ్లాదకరమైన దృశ్యం సోమవారం రాత్రి భక్తులను ఆకట్టుకుంది. రాఘవరాయుడి భక్తులు గర్భగుడి స్వర్ణ గోపుర కలశంపై ఉన్న నెలవంకను తిలకించి తరించారు.


రాఘవరాయడి గర్భగుడి శిఖర కలశంపై నెలవంక

'రామాయణం జాతీయ గ్రంథం'

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రామాయణం ఒక మత గ్రంథం కాదని, అది భారత జాతీయ గ్రంథమని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోగల వీహెచ్‌పీ కార్యాలయంలో ఇటీవల నిర్వహించిన రామాయణ గ్రంథ పరీక్షల్లో విజేతలైన విద్యార్థులకు, పరీక్షల నిర్వహణకు సహకరించిన పాఠశాలల యాజమాన్యాలకు, ఉపాధ్యాయులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులకు జ్ఞాపి కలు, విజేతలైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నందిరెడ్డి సాయిరెడ్డి మాట్లాడుతూ రామాయణ గ్రంథంలోని పాత్రలన్నీ సామాజిక సామరసతను తెలియజేస్తాయని వివరించారు. రాష్ట్రంలో 108 ప్రైవేటు పాఠశాలల్లో 10వేలకు పైగా విద్యార్థులు రామాయణ గ్రంథంపై నిర్వహించిన పరీక్షలు రాసి అం దరూ ఉత్తీర్ణత సాధించారన్నారు. నగరంలో 15 పాఠశాలల్లో 800 మంది విద్యార్థులు పాల్గొని రాష్ట్రంలోనే రెండో స్థానంలో జిల్లాను నిలిపారని ప్రశంసించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి, పరీక్షల రాష్ట్ర, జిల్లా కన్వీనర్లు గూడా సుబ్రహ్మణ్యం, జంపాల రాధిక, వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు బి. వాసుదేవయ్య, జిల్లా కార్యదర్శి మాళిగి భానుప్రకాశ్, సహ కార్యదర్శి ఈపూరి నాగరాజు, కోశాధికారి అయోధ్య శ్రీనివాసరెడ్డి, మహిళా విభాగాల కన్వీనర్లు పావని, ఈపూరి లక్ష్మి పాల్గొన్నారు.


ప్రతిభ చూపిన విద్యార్థులతో వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి


ఉరుకుందలో ముగిసిన మహాకుంభాభిషేకం


అలంకరణలో ఉరుకుంద ఈరన్న స్వామి

కౌతాళం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న గోపురాలపై మహా కుంభాభిషేకం, కలశాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు మూడో రోజు సోమవారంతో ఘనంగ ముగిశాయి. చివరి రోజు దేవాలయంలో గణపతి పూజ, గవ్యాంతమార్జనలు, పీఠ పూజ, నవరత్నాన్యాసం, విగ్రహ రలశ, ధ్వజ శిఖర ప్రతిష్ఠ వంటి కార్యక్రమాలను అల్లవరపు సుబ్రహ్మణ్యదీక్షితావధాని ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు స్వామి వారి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. కలాశాల ప్రతిష్ఠాపనలో పాల్గొన్న వివిధ మఠాల పీఠాధిపతులు దేవాలయంలో సుమారు రూ.8 కోట్లతో నిర్మించిన నాలుగు గోపురాలతో పాటు రాజగోపురానికి ప్రతిష్ఠించిన 32 బంగారు కలశాల ప్రతిష్ఠాపనకు పుష్పగిరి మఠం పీఠాధిపతులు జగద్గురు శంకరాచార్య విద్యానృసింహ భారతీస్వామి, మంత్రాలయం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, హల్వి మఠం పీఠాధిపతి మహంతేష్ స్వామి హాజరై కుంభాలతో గోపురాలపై కలశ ప్రతిష్ఠాపన చేపట్టారు. అంతకు ముందు యాగశాలలో కలశాలకు ప్రత్యేక హోమాలను నిర్వహించి ప్రతిష్ఠాపన చేపట్టారు. ఉత్సవాల సందర్భంగా ఉరుకుంద గ్రామస్థులు మహిళలకు కలశాలతో ఊరేగింపుగా గ్రామ చావిడి నుంచి బయలుదేరి స్వామి వారి సన్నిధిలో స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు.


ఉరుకుంద క్షేత్రంలో భక్తుల రద్దీ

కబళిస్తున్న క్యాన్సర్



- పెను ప్రమాదంలో ఆరోగ్యం
- నేడు వరల్డ్ క్యాన్సర్ డే

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ అత్యంత ప్రమాదకరమైన వ్యాధి. శరీరంలో ఏ భాగంలోనైనా క్యాన్సర్ రావచ్చు. శరీరంలో కణాలు అదుపు లేకుండా పెరిగినప్పుడు క్యాన్సర్ వస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా చోటు చేసుకుంటున్న మరణాలకు రెండో ప్రధాన కారణం క్యాన్సర్. మగవారిలో ఊపిరితిత్తులు, ప్రోస్టేట్, కొలోరస్ట్రాల్, కడుపు, లివర్ క్యాన్సర్లు ఎక్కువగా వస్తాయి. మహిళల్లో బ్రెస్ట్, కొలోరెక్టాల్ ఊపిరితిత్తులు, గర్భాశయ, థైరాయిడ్ క్యాన్సర్లు కనిపిస్తాయి. దేశంలో 40 లక్షల మంది క్యాన్సర్ బాధితులు మృతి చెందుతున్నారు. మంచి వైద్యం దొరికితే, ధైర్యంగా ఎదుర్కొంటే క్యాన్సర్ నుంచి బైటపడవచ్చు. నేడు వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

జిల్లాలో పరిస్థితి:

ఉమ్మడి జిల్లాలో ప్రతి ఏడాది కొత్తగా వేయి క్యాన్సర్ కేసులు వెలుగు చూస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో ప్రతి నెల 300, ప్రతి ఏడాది 3 వేల నుంచి 4వేల మంది క్యాన్సర్ బాధితులు ఎన్టీఆర్ వైద్యసేవ కింద ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుంటారు. ఉమ్మడి జిల్లాలో పురుషుల్లో నోటి, ఊపిరితిత్తులు, లివర్, ప్రేగు, క్యాన్సర్లు మహిళల్లో బ్రెస్ట్, గర్భాశయ ముఖద్వార, నోటి క్యాన్సర్లు అధికంగా వస్తున్నాయి. జిల్లా వైద్యఆరోగ్య శాఖ పరిధిలో ఎన్‌సీడీ 3.0 కింద సర్వేల్లో రొమ్ము క్యాన్సర్లు 17, గర్భాశయ క్యాన్సర్లు 5, నోటి క్యాన్సర్లు 11 వరకు కేసులను గుర్తించారు.

ఈ ఏడాది నినాదం

క్యాన్సర్ డే యూనియన్ ఫర్ ఇంటర్నేషనల్ క్యాన్సర్ కంట్రోల్ (యుఐసీసీ) నిర్వహిస్తుంది. ఈ ఏడాది యునైటెడ్ బై యూనిక్ అనే నినాదాన్ని ఇచ్చింది. క్యాన్సర్ చికిత్సలో వ్యక్తులకు ప్రాధాన్యత ఉంటుంది. క్యాన్సర్‌తో పోరాడే ప్రతి వ్యక్తికి ప్రత్యేకమైన అనుభవం ఉంటుందని, అందరూ క్యాన్సర్‌ను అధిగమించేందుకు కలిసి పోరాటాన్ని కొనసాగించాలనడం ఈ ఏడాది ప్రాధాన్యత. .

క్యాన్సర్ లక్షణాలు

- జ్వరం, రక్తస్రావం
- మింగడం కష్టమవ్వడం, విపరీతమైన అలసట
- దగ్గు మానకుండా రావడం, గొంతు, బొంగురు పోవడం
- అతిగా బరువు తగ్గిపోవడం, ఆకలి తగ్గడం
- కొత్తపుట్టుమచ్చ, పుట్టుమచ్చలో మార్పు
- పుండ్లునయం కాకపోవడం
- మూత్రవిసర్జనలో నొప్పి, మూత్రంలో రక్తం కారడం

స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఓ వరం



కర్నూలులో స్టేట్ క్యాన్సర్ ఆసుపత్రి

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో ఏర్పాటు చేసిన స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ రాయలసీమ ప్రాంతానికి ఓ వరం లాంటిదవి. ఈ స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ ఫిబ్రవరి నెలలో అందుబాటులోనికి తీసుకురావాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు. రూ.30 కోట్లతో లీనియర్ యాక్సిలేటర్ అల్ట్రాసౌండ్, సిటీ స్కాన్ యంత్రాలు ఏర్పాటు చేశారు. రూ.19 కోట్లు విలువైన పెట్‌స్కాన్ యంత్రం రావాల్సి ఉంది.

నేడు క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



వరల్డ్ క్యాన్సర్ డేను పురస్కరించుకుని కర్నూలు ప్రభుత్వ వైద్యశాల మెడికల్ కాలేజీలో క్యాన్సర్ అవగాహన ర్యాలీని మంగళవారం నిర్వహిస్తున్నాం. అనంతరం స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌లో అవగాహన సదస్సు ఏర్పాటు చేశాము. 120 పడకలతో ఏర్పాటు చేస్తున్న స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌లో త్వరలో సేవలు అందుబాటులో వస్తాయి. ప్రస్తుతం మెడికల్, సర్జికల్, రేడియేషన్ సేవలు అందుబాటులో ఉన్నాయి.

- డా.సీఎస్ క్రిష్ణప్రకాష్, డైరెక్టర్, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్, కర్నూలు

క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించాలి



క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తిస్తే ప్రాణాపాయం తప్పుతుంది. విపరీతమైన అలసట, దగ్గు, ఆకలి, మూత్ర విసర్జన సమయంలో నొప్పి, శరీరంలోని ఏభాగమైనా గట్టిపడటం వంటి లక్షణాలు ఉంటే పరీక్షలు చేయించుకోవడం అవసరం. వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా వీఆర్ హాస్పిటల్‌లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. **- డా.సి. వాసురెడ్డి, క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణుడు, వీఆర్ హాస్పిటల్, కర్నూలు**

స్మోకింగ్‌తో క్యాన్సర్



ధూమపానం, గుట్కా క్యాన్సర్ రావడానికి ప్రధాన కారణం. దాదాపు 40శాతం కేసులకు కారణం మనం పొగాకు ఉత్పత్తుల వాడకమే. పొగాకు డీఎన్‌ఏను దెబ్బతీసి, డీఎన్‌ఏ కణాలు అసాధారణంగా పెరగడానికి కారణమవుతుంది.

- డా.రవీంద్రబాబు, క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణుడు, ఒమేగా హాస్పిటల్, కర్నూలు

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మంత్రాలయం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాఘవేంద్ర పురం గ్రామానికి చెందిన చాకలి వసంత(34) అనే వ్యక్తి తన కొట్టంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వసంత కడుపు నొప్పితో బాధపడు తుండేవాడు. కర్నూలు, రాయచూరు, ఆదోని, ఎమ్మిగనూరు ఆసుపత్రుల్లో చికిత్స చేయించినప్పటికీ నయం కాలేదు. ఇబ్బందులు తాళలేక ఆదివారం రాత్రి తన ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న బంధువులు ఆసుపత్రికి తీసుకెళ్లేలోపే మృతి చెందాడు. మృతునికి భార్య హైమావతి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కట్టుకున్నోడే కాలయముడు..

- భార్యను కత్తితో పొడిచి హత్య చేసిన భర్త

తుగ్గలి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కట్టుకున్నోడే కాలయముడయ్యాడు. భార్యను కత్తితో పొడిచి హత్య చేశాడు. ఈ ఘటన మండలంలోని రాతన కొత్తూరులో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తుగ్గలి మండలంలోని రాతనకొత్తూరు చెందిన కాశీం, కాశీంబీ దంపతుల కుమార్తె మహబూనిసీ(32) 15 ఏళ్ల క్రితం చెన్నంపల్లికి చెందిన మహమ్మద్, అల్లీంబీ దంపతుల పెద్దకుమారుడైన అక్బర్ వలికి ఇచ్చి వివాహం చేశారు. ఆరేళ్లపాటు కలిసి ఉన్న ఆ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎనిమిదేళ్ల క్రితం భర్త వేదింపులు తాళలేక పుట్టినిల్లయిన రాతన కొత్తూరుకు వచ్చి తల్లిదండ్రుల వద్దే ఉంటూ తన ఇద్దరు కుమారులను చదివించుకుంటోంది. సోమవారం ఉదయం మహబూనిని పొలంలో పని చేస్తుండగా భర్త అక్బర్‌వలి దాడి చేసి కత్తితో పొడిచి గొంతు కోయడంతో అక్కడికక్కడే ఆమె మృతి చెందింది. విషయం తెలుసుకున్న తుగ్గలి ఎస్‌ఐ కృష్ణమూర్తి సంఘటనా స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.



అనాథలైన పిల్లలు



మహబూనీ (ఫైల్)

బైకులు ఢీ.. ఒకరి మృతి

ఆదోని, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 104 బసాపురం గ్రామంలో ఆదివారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాలు.. 104 బసాపురం గ్రామానికి చెందిన మాల వీరేష్ పని నిమిత్తం ఆదివారం రాత్రి ఆదోనికి ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. అదే సమయంలో ఆదోని నుంచి బసాపురానికి వస్తున్న మాదిగ వీరేష్ బైకు పరస్పరం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మాల వీరేష్(32)కు తీవ్రగాయాలు కావడంతో ఆదోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు వెళ్లారు. కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య లతతోపాటు ఇద్దరు కుమారులు కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇస్వీ పోలీసులు తెలిపారు.



వీరేష్ (ఫైల్)

కొడుకు అన్యాయం చేశాడు..

- పోలీసులను ఆశ్రయించిన వృద్ధ దంపతులు

పత్తికొండ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కొడుకు తమకు అన్యాయం చేశాడని న్యాయం చేయాలంటూ వృద్ధ దంపతులు సోమవారం పత్తికొండ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. నంద్యాల జిల్లా డోన్ పట్టణానికి చెందిన గంగిరెడ్డి, సుబ్బలక్ష్మి పట్టణంలోని నాలుగు స్తంభాల కూడలి లోని గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులతో బైఠాయించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వవరాల మేరకు.. డోన్ పట్టణానికి చెందిన వీరికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు సంతానం. 1999లో అక్కడే ఇంటిని కొనుగోలుచేసి కాపురమున్నారు. పిల్లలకు వివాహం చేసి, కొడుకుతో ఇబ్బందులు రావడంతో ఇంటిని ఖాళీ చేశారు. ఫిర్యాదు చేసేందుక రాగా, పోలీసులు డోన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయాలని సూచించారు. తమకు పింఛన్ లేదని, పత్తికొండ శారదా వృద్ధాశ్రమంలో తలదాచుకుంటున్నామని ఆంధ్రజ్యోతికి తెలిపారు.



పోలీసులతో మాట్లాడుతున్న వృద్ధులు

డీఐజీని కలిసిన ఎస్పీ

కర్నూలు క్రైం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్‌ను ఎస్పీ విక్రాంత్ పాటిల్ మర్యాదపూర్వకంగా కలిశారు. డీఐజీ కార్యాలయంలో డీఐజీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపట్టాల్సిన శాంతిభద్రతల చర్యలపై చర్చించారు.



డీఐజీకి మొక్క అందజేస్తున్న ఎస్పీ

ఇంటర్ ప్రాక్టికల్స్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

- ఆర్ఐవో గురువయ్యశెట్టి



మాట్లాడుతున్న ఆర్ఐవో గురువయ్యశెట్టి

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 5వ తేదీ నుంచి 25వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి అన్నారు. సోమవారం స్థానిక ఆర్ఐవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రాక్టికల్స్ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 91 ప్రాక్టికల్స్ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. మొత్తం విద్యార్థులు 15194 మంది హాజరవుతున్నారని వెల్లడించారు. ఇందులో బైపీసీ విభాగం విద్యార్థులు 4679 మంది, ఎంపీసీ 10,515 మంది, ఒకేషనల్ కోర్సు విద్యార్థులు 4172 మంది విద్యార్థులు ఉన్నారని వివరించారు. ఈ పరీక్షలు 5 విడతలుగా కొనసాగుతాయన్నారు. 5 నుంచి 20వ తేదీ వరకు ఒకేషనల్ కోర్సు విద్యార్థులకు, 10 నుంచి జనరల్ కోర్సు విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు కొనసాగుతాయని చెప్పారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పరీక్ష కేంద్రాల నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్రాలలో నాలుగు ల్యాబులలో ఫర్నీచర్స్, వాటికి అవసరమయ్యే మెటీరియల్స్‌ను సిద్ధం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ జి.లాలెప్ప, డీఈసీ కమిటి సభ్యులు నాగభూషణం రెడ్డి, యు.పద్మావతి, జీఎస్ సురేష్ చంద్ర, మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రాక్టికల్స్ పరీక్షలపై ఓరియంటేషన్ ప్రోగ్రాం:

స్థానిక ప్రభుత్వ టౌన్‌మోడల్ జూనియర్ కళాశాలలో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రాక్టికల్స్ పరీక్షలపై ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు ఆర్ఐవో గురువయ్యశెట్టి తెలిపారు. ఈ సమావేశానికి డీఈసీ సభ్యులు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ ఆఫీసర్లు, కళాశాల ప్రిన్సిపాల్స్, సబ్జెక్టు అధ్యాపకులు హాజరు కావాలన్నారు.

ప్రశాంతంగా పర్యావరణ విద్య పరీక్ష

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన పర్యావరణం విద్య పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో మొత్తం 162 కళాశాల్లో 23,281 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో 22,764 విద్యార్థులు హాజరు కాగా, 517 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఆర్ఐవో గురువయ్యశెట్టి స్పెషల్ ఆఫీసర్ జి.లాలెప్ప, డీఈసీ సభ్యులు పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు.

పీఎంశ్రీ పాఠశాలలపై సమీక్ష

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, నంద్యాల జిల్లాల పీఎంశ్రీ పాఠశాలల పురోగతిపై స్టేట్ సిమాట్ డైరెక్టర్ వి.మస్తానయ్య సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో 52 పాఠశాలలు, నంద్యాల జిల్లాలో 40 పాఠశాలలు హెచ్‌ఎంలతో సమగ్ర శిక్ష సమావేశ మందిరంలో మాట్లాడుతూ పీఎంశ్రీ పాఠశాలల ఫేస్-1, 2కు విడుదలైన కెమిస్ట్రీ ల్యాబ్‌లు, కంప్యూటర్ ల్యాబ్‌లు, లైబ్రరీ, ఆట స్థలాలు, కాంపోజిట్ గ్రాంట్ నిధులను సక్రమంగా వినియోగించు కోవాలని దుర్వినియోగం కాకుండా చూడాల న్నారు. పనులు సకాలంలో నాణ్యతతో చేయాలని సూచించారు. సమగ్ర శిక్ష అడిషినల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్లు వి.శ్రీనివాసులు, హేమంత్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పి.శ్రీనివాసులు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కోడుమూరు పోలీస్ స్టేషన్ తనిఖీ



స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

కోడుమూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కోడుమూరు పోలీసు స్టేసన్‌ను ఎస్పీ విక్రాంత్ పాటిల్ సోమవారం రాత్రి తనిఖీ చేశారు. కేసులకు కేసుల వివరాలను సీఐ తబ్రేజ్‌ను అడిగి తెలుసుకొన్నారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలు, నేర చరిత వ్యక్తులపై నిఘా అంశాలపై చర్చించారు. ఆయన వెంట ఎస్‌ఐ ఏపీ శ్రీనివాసులు ఉన్నారు.

మఠం భూములు మాకే చెందాలి



మంత్రాలయం రాఘవేంద్ర సర్కిల్‌లో ధర్నా చేస్తున్న రైతులు

- రాఘవేంద్ర సర్కిల్‌లో రైతుల ధర్నా

మంత్రాలయం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వంశపారంపర్యంగా తరతరాలుగా అనుభవిస్తున్న రాఘవేంద్రస్వామి మఠానికి చెందిన ఇనాం భూములు తమకే దక్కాలంటూ రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. దాదాపు 200 మంది రైతులు సోమవారం మంత్రాలయం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐకి వినతి పత్రం ఇచ్చారు. అక్కడి నుంచి వచ్చి రాఘవేంద్ర సర్కిల్‌లో ధర్నా చేపట్టారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించారు. మంత్రాలయంలోని సర్వే నెంబర్ 157, 148/1, 200/1, 373/3, 165, 166, 288, 142, 223, 283 లలోని దాదాపు 50 ఎకరాల భూమిని నిరుపేదలైన రైతులు సాగు చేస్తూ వాటితో జీవనం సాగిస్తున్నారు. పట్టాదారుని కాలమ్‌లో రాఘవేంద్రస్వామి పేరు ఉండటం, అనుభవదారుల కింద రైతుల పేర్లు ఉన్నాయి. దీంతో రిటైర్డు ఫారెస్టు అధికారి కామటే రాఘవేంద్ర, మడ్డి మాణిక్యమ్మ, వణికే కృష్ణమ్మ, సరస్వతి, జయలక్ష్మి, నాగరాజు, అంజినమ్మ, ఏబు, రాజు, ఖయాన్, తిమ్మయ్య, ప్రభుదాసుతోపాటు దాదాపు 180 మంది రైతులు పెద్ద ఆందోళన చేసి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. పెద్దల నుంచి వారసత్వంగా వస్తున్న భూములను తహసీల్దార్ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో తమ పేర్లు తొలగించి రాఘవేంద్రస్వామి మఠం పేరు మీదుగా ఉండేలా అధికారులు కుమ్మక్కు అవుతున్నారని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు సాగు చేస్తున్న శ్రీమఠం భూములు తమకే వర్తించేలా చూడాలని, రిజిస్ట్రేషన్‌లు జరిగేవిధంగా క్రయవిక్రయాలు చేసేలా సబ్ రిజిస్ట్రార్‌లో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మారెప్ప, రాఘవేంద్ర, రామయ్య, ఈరయ్యశెట్టి, ప్రహ్లాదశట్టి, భాగ్యమ్మ, అంపమ్మ, లక్ష్మి, హనుమంతు పాల్గొన్నారు.

గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దండి

- జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఈవో నాసరరెడ్డి

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం స్వచ్ఛభారత్ మిషన్, జీఎస్‌డబ్ల్యూఎస్ అంశాలపై ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, డీపీఓ భాస్కర్, డీఎల్‌డీఓ రమణారెడ్డి, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 484 గ్రామాలు ఉన్నాయని, ఇప్పటికే 63 గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దామని అన్నారు. మిగిలిన గ్రామాలలో కూడా వ్యక్తిగత మరుగుదొడ్లు, బహిరంగ ప్రదేశాలలో వ్యర్థాల నియంత్రణ, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణ పూర్తి స్థాయిలో చేపట్టాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 2,82,066 మంది సిటిజెన్స్ సచివాలయాల్లో నమోదు కాలేదన్నారు. అయితే వీరంతా ల్యాండ్ రికార్డ్స్, రైస్ కార్డు, ఆరోగ్య శ్రీలో వారి పేర్లు ఉండటంతో పాటు వివిధ రకాల ప్రభుత్వ ప్రయోజనాలు పొందుతు న్నారన్నారు. తక్షణమే వీరందరిని సచివాలయాల్లో నమోదు చేయించాలని ఎంపీడీఓలను ఆదేశించారు. ఈ సమావేశంలో డీపీఆర్‌సీ కో ఆర్డినేటర్ మంజుల పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



అడిషనల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న ప్రజలు

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించాలని నగర పాలక అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ అన్నారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. ఎస్‌ఈ రాజశేఖర్, మేనేజర్ చిన్నరాముడు, ఆరోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఎంఈ సత్యనారాయణ, ఆర్ఓ జునైద్, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

లక్ష డప్పుల కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్‌యూ ఉపకులపతి

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈ నెల 7న నిర్వహించే లక్ష డప్పులు.. వేయి గొంతుల సభను జయప్రదం చేయాలని ఇన్‌చార్జి ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ పిలుపునిచ్చారు. రాయలసీమ యూని వర్సిటీలో ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్‌యూ విద్యార్థి నాయకులు సుంకన్న, హుస్సేని, మాధవ శంకర్, ఎంఎస్‌ఎఫ్ నాయకులు మద్దిలేటి, మద్దయ్య, సుబ్బ రాయుడు తదితరులు పాల్గొన్నారు.

టెంకాయల వేలం



వేలంలో పాల్గొన్న ఆలయ ఈవో, తదితరులు

గూడూరు జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.నాగలాపురంలో సుంకులాపరమేశ్వరి అమ్మవారి ఆలయానికి సంబంధించి టెంకాయలు, పూలు, నిమ్మకాయల వేలం పాట సోమవారం నిర్వహించారు. టెంకాయల వేలాన్ని టి.రంగస్వామి రూ.14లక్షల యాభై వేలకు దక్కించుకోగా, పూలు, నిమ్మకాయల వేలాన్ని ఆర్ సుదర్శన్ రెడ్డి రూ.2లక్షల యాభై ఐదు వేలకు దక్కించుకున్నట్లు ఆలయ ఈవో బీవీ నరసయ్య తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కల్వర్టులను నిర్మించాలి: గూడూరు ఎస్సీ కాలనీలో కల్వర్టులు శిథిలావస్థకు చేరారని, వాటిని నిర్మించాలని కౌన్సిలర్ ఎం.బుడ్డం గలి కోరారు. సోమవారం గూడూరు నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ నాగరాజుకు కౌన్సిలర్ ఎం.బుడ్డంగలి, నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ రామాంజనేయులు, టీడీపీ నాయకుడు పౌలు వినతి పత్రాన్ని సమర్పించారు.

మహిళల ఆరోగ్యంపై పర్యవేక్షణ ఉండాలి



కాల్వలో సంచార చికిత్సను పరిశీలిస్తున్న జిల్లా నోడల్ అధికారి

ఓర్వకల్లు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు అన్నారు. సోమవారం మండలంలోని కాల్వ గ్రామంలో జరుగుతున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణిగా పేరు నమోదైనప్పటి నుంచి వారికి ఆరోగ్య సూత్రాలను సూచించడంతో పాటు ప్రతి నెలా సక్రమ పద్ధతిలో వైద్యపరీక్షలు చేసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రేఖ, సామాజిక ఆరోగ్య అధికారి అఖిల్ ప్రాజెక్టనిస్టు ఖలీల్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం: రోగులకు మెరుగైన వైద్యం అందించడమే తమ లక్ష్యమని ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రేఖా అన్నారు. సోమవారం మండలంలోని హుశేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీపీ తిప్పన్న సర్పంచ్ చంద్రగోవర్ధనమ్మ, ఎంపీడీవో శ్రీనివాసులు, మెడికల్ ఆఫీసర్ రేఖ పాల్గొని పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎం కార్యవర్గంలో జిల్లా వాసులకు చోటు

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర మహాసభలు నెల్లూరులో సోమవారం ముగిశాయి. నూతన కార్యవర్గంలో కర్నూలు జిల్లా వాసులకు చోటు లభించింది. నూతన రాష్ట్ర కమిటీలో జిల్లా నుంచి మూడోసారి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా డి.గౌస్ దేశాయ్, పి.నిర్మలమ్మలను ఎన్నుకున్నారు.

ఘనంగా వసంత పంచమి



హరిహర క్షేత్రంలో అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న అర్చకులు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని సంకల్‌బాగ్ హరిహర క్షేత్రంలో సోమవారం వసంతపంచమిని పురస్కరించుకుని సరస్వతీదేవికి అర్చనలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం చిన్న పిల్లలకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని చేపట్టారు. వేద పండితుడు సాయినాథ శర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ప్రసన్న కుమార్ శర్మ, మహేశ్ శర్మ తదితరులు ఆధ్వర్యంలో ఈ అక్షరాభ్యాస కార్యక్రమాన్ని కొనసాగించి, పిల్లలకు ఉచితంగా పలకలు, బలపాలు, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. క్షేత్రంలో సాయంత్రం స్వామి, అమ్మవార్లను గరుడ వాహనంపై ఉంచి వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్ష కార్యదర్శులు సండేల్ చంద్రశేఖర్, నాగులవరం రాజశేఖర్, ఆలయ కమిటీ ప్రతినిధులు సీవీ దుర్గా ప్రసాద్, చల్లా నాగరాజ శర్మ, టీవీ రవిచంద్రశర్మ, శ్యామసుందరశర్మ పాల్గొన్నారు.

కర్నూలు ఎడ్యుకేషన్: స్థానిక మాధవీనగర్‌లోని రవీంద్ర ఇంగ్లీషు మీడియం పాఠశాల, రెవెన్యూ కాలనీలోని రవీంద్ర టాలెంట్ స్కూల్‌లో కరస్పాండెంట్ పీవీవీ సుబ్బయ్య ఆధ్వర్యంలో సోమవారం వసంత పంచమిని ఘనంగా నిర్వహించారు. వేద పండితులు మురళీధర్ శర్మ, కృష్ణమూర్తి మంత్రోచ్ఛరణాల మధ్య చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శారదేదేవి, కోఆర్డినేటర్ అక్తర్‌బేగం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● గణేష్ నగర్‌లోని హరిజోన్స్ ఇంటర్నేషనల్ ప్లే స్కూల్‌లో చైర్మన్ ప్రదీప్ కుమార్, డైరెక్టర్ పావని ఆధ్వర్యంలో వసంత పంచమిని ఘనంగా నిర్వహించారు. వేద పండితులు ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం పూజలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు రథసప్తమి

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రథసప్తమి వేడుకను నగరంలో వివిధ ఆలయాల్లో మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో సూర్య నారాయణ స్వామికి హోమాలు, అర్చనలు, సూర్యాష్టకాలు నిర్వహిస్తున్నారు. అలాగే వివిధ పాఠశాలల్లోనూ రథ సప్తమి సందర్భంగా విద్యార్థులతో సామూహిక సూర్య నమస్కారములు ఏర్పా టు చేశారు. యోగ శిక్షణ కేంద్రాల్లోనూ రథ సప్తమి నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

● నగరంలోని చిత్తారి వీధిలోగల శ్రీభద్రావతి భావనారాయణ స్వామివార్ల దేవాలయంలో మంగళవారం ఉదయం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం 12.35 గంటలకు భద్రావతి దేవి, భావనారాయణ స్వామి వార్ల కల్యాణం ఏర్పాటు చేశారు. సాయంత్రం 5.30 గంటలకు కేరళ వాయిద్యాలతో ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

● హరిహర క్షేత్రంలో సూర్య భగవానుడికి ప్రత్యేక అర్చనలు, పూజలను ఏర్పాటు చేసినట్లు నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సండేల్ చంద్రశేఖర్, చల్లా నాగరాజ శర్మ తెలిపారు.

● టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ (హెచ్‌డీపీపీ) ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో, నగర శివారులో బి. తాండ్రపాడులోని క్రెడో పాఠశాల్లో మంగళవారం ఉదయం 8 గంటలకు విద్యార్థులతో సామూహిక సూర్యనమస్కార కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు హెచ్‌డీపీపీ జిల్లా కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, పాఠశాల యాజమాన్యం టి.శ్రావ్యలక్ష్మి, ఎస్‌బీ కార్తీక్‌కుమార్ తెలిపారు.

రేపు యూత్ బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్‌ఏ అవుట్‌డోర్ స్టేడియంలో అండర్-16 యూత్ బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు బుధవారం ఉదయం 10 గంటలకు జరుగుతాయని బాస్కెట్ బాల్ సంఘం ప్రతినిధి దాదాబాసా సోమవారం తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు పీఠాపురంలో ఈ నెల 8, 9, 10 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని, ఎంపికకు హాజరయ్యే విద్యార్థులు 1.1.2009 తర్వాత జన్మించిన వారై ఉండాలని అన్నారు. వివరాల కోసం 9985161007ను సంప్రదించాలని సూచించారు.

● మహిళా హాకీ ఎంపిక పోటీలు: నంద్యాల ఎస్‌పీజీ హై స్కూల్‌లో సీనియర్ మహిళల హాకీ ఎంపిక పోటీలు నిర్వహిస్తు న్నట్లు కార్యదర్శి దాసరి సుధీర్ తెలిపారు. క్రీడాకారులు 1996 తర్వాత పుట్టిన వారై ఉండాలన్నారు. వివరాలకు 9966565317ను సంప్రదించాలన్నారు.

బ్రాహ్మణదొడ్డిలో పర్యటించిన సీఐ

సి.బెళగల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణదొడ్డి గ్రామంలో కోడుమూరు సీఐ తబ్రేజ్ సోమవారం పర్యటించారు. అనంతరం ఆయన గ్రామస్థులతో మాట్లాడుతూ గ్రామస్థులంతా కలిసి మెలసి జీవించాల న్నారు. సీఐ వెంట గూడూరు, సి.బెళగల్ ఎస్‌ఐలు తిమ్మయ్య, తిమ్మారెడ్డి, పోలీసులు ఉన్నారు.

సాలమ్మ సత్రంపై అవగాహన కల్పించండి



సాలమ్మ సత్రాన్ని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హస్పిటల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): జి.పుల్లారెడ్డి కాంప్లెక్స్‌లో ఉన్న సాలమ్మ సత్రం వసతి గృహాలపై రోగులకు అవగాహన కల్పించాలని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆదేశించారు. సోమవారం సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బి.వెంకటేశ్వరరావు హస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కిరణ్ కుమార్‌తో కలిసి ఆయన సాలమ్మ సత్రాన్ని పరిశీలించారు. సత్రంలో 28 వసతి గృహాలు ఉండగా.. కేవలం ఆరుగురు ఐపీ రోగులు ఉండ టంపై ఆరా తీశారు. హస్పిటల్‌లో అడ్మిషన్ అయిన ఐపీ రోగులు వారి బంధువులకు సాలమ్మ సత్రం గురించి మైకుల ద్వారా వివ రించాలని ఆదేశించారు.

● నర్సింగ్ స్కూల్ తనిఖీ: కలెక్టరేట్ ఆవరణలో ఉన్న గవర్నమెంటు నర్సింగ్ స్కూల్‌ను సూపరింటెండెంట్ తనిఖీ చేశారు. హస్టల్ నర్సింగ్ విద్యార్థుల డైట్‌ను స్వయంగా తిని నాణ్యతను పరిశీలించారు. హస్టల్‌లో సెక్యూరిటీ, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని హెల్త్ ఇన్‌స్పెక్టర్ గోవింద స్వామిని ఆదేశించారు.

మినరల్ వాటర్ ప్లాంట్ల ప్రారంభం: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో హిందూస్థాన్ కోకోకోలా బెవరేజెస్ వై4డీ ఫౌండేషన్ పూణే సహకారంతో రెండు ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌లను ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ముందుగా ఓపీ కౌంటర్ (ఓపీ నెంబర్.9) దగ్గర ఆ తర్వాత సదరం క్యాంపు దగ్గర వాటర్ ప్లాంట్లను ఆయన ప్రారంభించారు. కార్యక్ర మంలో సీఎస్ఆర్ఎంవో డా.బీవీ రావు, ఎమర్జెన్సీ విభాగం హెచ్‌వోడీ డా.రాంశివ నాయక్, అడ్మినిస్ట్రేటర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణకు అభినందనలు



బాలకృష్ణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సుధాకర్ నాయుడు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణను జిల్లా బాలకృష్ణ ఫ్యాన్స్ అధ్యక్షుడు సుధాకర్ నాయుడు ఘనంగా సత్కరించారు. సోమవారం హిందూపురంలోని బాలకృష్ణ కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్ర మంలో సుధాకర్ నాయుడు శాలువ కప్పి, పుష్ప గుచ్ఛం అందజేసి సత్కరించారు. బాలకృష్ణకు కేంద్ర ప్రభుత్వం నుంచి పద్మభూషణ్ వచ్చిన సందర్భంగా, అలాగే హిందూపురం మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని టీడీపీ కైవసం చేసుకున్న సందర్భంగా బాలకృష్ణ జిల్లా ఫ్యాన్స్ తరఫున సత్కరించినట్లు సుధాకర్ నాయుడు పేర్కొన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంటు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు

కోడుమూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చౌడేశ్వరి దేవి జాతర పురస్కరించుకొని జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంటును సోమవారం ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు ప్రారంభించారు. స్థానిక ఎస్ఆర్‌టీ మైదానంలో ముందుగా సర్పంచు భాగ్యరత్న, ఎస్ఐలు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం సర్పంచు టాస్ వేయగా క్రికెట్ ఆటను ఎస్ఐ ప్రారంభించారు. ఈ పోటీలకు ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి ఆదోని, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, కోడుమూరు, నందికొట్కూరు తదితర ప్రాంతాల నుంచి సుమారు 30 జట్లు వచ్చాయి. ఈ పోటీలో గెలుపొందిన ప్రథమ జట్టుకు రూ.50వేల నగదు, ద్వితీయ జట్టుకు రూ.25వేలు, తృతీయ జట్టుకు రూ.10వేల నగదును అందించనున్నారు. ఆటల పోటీల స్టీరింగ్ కమిటీ లాయర్ ప్రభాకర్, నాగేశ్వరరావు, బలరాం, ఆంధ్రయ్య, నటరాజ్ పాల్గొన్నారు.

'ప్రజలకు అందుబాటులో ఉండాలి'

సి.బెళగల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో రాణెమ్మ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. ఈసమావేశంలో ఈవోఆర్డీ ఈశ్వరస్వామి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక తాండ్రపా డులోని క్రెడో స్కూల్‌లో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర కుమార్ రోడ్డు భద్రతపై విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మోటారు వెహి కల్ ఇన్‌స్పెక్టర్ బాబు కిషోర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడు కేసులు

కర్నూలు క్రైం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): సంతోష్ నగర్ వద్ద ట్రాఫిక్ పోలీసులు సోమవారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు చేసి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 7 ద్విచక్ర వాహనాదారులను అదుపులోకి తీసుకుని, వారిపై కేసు నమోదు చేశారు. వీరిని కోర్టులో హాజరు పరుస్తామని సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు. ఈ తనిఖీల్లో ఆర్ఎస్ఐ, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

'అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలి'

కల్లూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని ప్రజా పరిరక్షణ సమితి నాయకుడు డేవిడ్ డిమాండ్ చేశారు. సోమవారం కృష్ణానగర్ జిల్లా కోఆపరేటివ్ సహకార సొసైటీ కార్యాలయం ముందు ప్రజా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈసందర్భంగా నాలుగో తరగతి ఉద్యోగులకు కేటాయించిన స్థలాలను వారికే అప్పజెప్పాలన్నారు. కార్యక్రమంలో కుమారస్వామి, జెట్టికృష్ణ, మగ్బుల్ పాల్గొన్నారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి: జాయింట్ కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): సీఎంవో గ్రీవెన్స్‌లో దరఖాస్తులను పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ నవ్య అధికారులను ఆదేశించారు. అందుకు సంబంధించి పత్తికొండ ఆర్డీవో వద్ద 17, ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 15, ఆర్డీవో కర్నూలు వద్ద 10, డీఎస్‌వో వద్ద 2, ఏవో కలెక్టరేట్, జిల్లా పురావస్తు శాఖ అధికారి, జిల్లా కో ఆపరేటివ్ అధికారి, జిల్లా రిజిస్ట్రార్, డీఎస్పీ, కర్నూలు, మున్సిపల్ కమిషనర్ వక్ఫ్‌బోర్డు వద్ద ఒక్కొక్క దరఖాస్తు చొప్పున పెండింగ్‌లో ఉన్న వాటిని బియాండ్ ఎస్ఎల్ఏలో వెళ్లకుండా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో వెంకటనారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కొండయ్య, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

● ప్రజా సమస్యల పరిష్కార వేదికకు కొన్ని వినతులు: కర్నూలు నగరంలోని లక్ష్మీనగర్‌లో మురుగు కాలువలు సరిగ్గా లేవని, కాలువలను పునఃనిర్మించాలని స్థానికులు చంద్రశేఖర్ రెడ్డి, కే.చెంచిరెడ్డి, రవి, టి.శంకరయ్య జేసీకి అర్జీ సమర్పించారు.

● సోమిశెట్టి నగర్‌లో ఒకే బిల్డింగ్‌లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆయుష్మాన్ మదర్ థెరిసా నర్సింగ్ కళాశాలలు నిర్వహిస్తున్నారని, విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు ఎం.రంగప్ప, జిల్లా సెక్రటరీ ఎస్.అబ్దుల్లా, కార్యవర్గ సభ్యులు కోరారు.

● మాకు సర్వేనెంబరు.134/1లో 53 సెంట్లు భూమి ఉందని, మా భూమికి సంబంధించి ఆన్‌లైన్‌లో అడంగల్‌లో వేరే వారి పేరు పొరపాటున నమోదు చేశారని, అలా కాకుండా మాపేర్లను నమోదు చేయించాలని కర్నూలు మండలం పసుపుల గ్రామ నివాసితులు పి.ఏసన్న, పి.పెద్దయ్య జేసీకి అర్జీ సమర్పించారు.

బాధిత కుటుంబాలకు ఉద్యోగం కల్పించాలి ఎమ్మిగనూరు పట్టణంలోని మున్సిపల్ పరిధిలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తూ మృతి చెందిన కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప, జాయింట్ కలెక్టర్ నవ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరు మున్సిపల్ పరిధిలోని పని చేస్తున్నటువంటి పారి శుధ్య కార్మికులు 2020 నుంచి 2025 వరకు 13 మంది కార్మికులు చనిపోయినా మున్సిపల్ కమిషనర్ ఉద్యోగాలు ఇవ్వడానికి నిరాకరిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి చంద్రశేఖర్, తిమ్మగురుడు, సుమాంజలి, హుశేన్‌బీ, ఆదారమ్మ, ఆశాలక్ష్మి, నసీమా, రాజారాం, మధు పాల్గొన్నారు.

రైల్వే చార్జీలో 50 శాతం రాయితీ ఇవ్వాలి



ధర్నా చేస్తున్న వృద్ధులు, కళాకారులు

కర్నూలు రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రైళ్లలో ప్రయాణించే వృద్ధులు, కళాకారులు, వికలాంగులకు, విలేకర్లకు చార్జీలో 50శాతం రాయితీ ఇవ్వాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు పుల్లారెడ్డి, నర్సుద్దీన్, మహేశ్వరరావు, మద్దిలేటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు రైల్వేస్టేషన్ ఎదుట ధర్నా చేశారు. ఈకార్యక్రమానికి బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యాకోబ్ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అరవై ఏళ్లు నిండిన వృద్ధుల వయస్సును దృష్టిలో ఉంచుకుని రైల్వేచార్జీలో రాయితీ కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం స్టేషన్ మేనేజర్ నాగరాజుకు వినతిపత్రం సమ ర్పించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, పాపయ్య, నాగేంద్ర, పాపా రావు, గోపినాథ్ పాల్గొన్నారు.

కందుల కొనుగోలు ప్రారంభం



కందులను కొనుగోలును ప్రారంభిస్తున్న అధికారులు

కోడుమూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సోమవారం రైతుల నుంచి మద్దతు ధరతో కందుల కొనుగోలు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి రవిప్రకాష్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని ఆర్ఎస్‌కేల దగ్గర కందులు కొనుగోలు చేస్తారని చెప్పారు. క్వింటాకు రూ.7550 మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పంట నమోదు చేసుకొన్న గరిష్ఠంగా ఒక రైతు నుంచి 100 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేసే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. రైతులు పాస్‌బుక్, ఆధార్, బ్యాంక్ పాసుబుక్ జిరాక్స్‌లు తీసుకొని రావాలని తెలిపారు. మార్క్‌ఫెడ్ మేనేజర్ నాగేశ్వరరెడ్డి, ఆర్ఎస్‌కే సిబ్బంది జయంత్, ప్రవీణ్, విజయశాంతి పాల్గొన్నారు.

గుండెపోటుతో టీడీపీ కార్యకర్త మృతి

కోడుమూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొండపేటలో నివాసం ఉన్న బోయ నాగరాజు(60) సోమవారం గుండెపోటు మృతి చెందారు. నాగరాజు ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం కూతురు కొడుకు పెళ్లికి హాజరై ఇంటికి వచ్చి రాత్రి నిద్రించాడు. గుండెపోటుతో సోమవారం ఉదయం నిద్ర లోనే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకొన్న టీడీపీ సీనియర్ నాయకులు డి.విష్ణువర్ధన్‌రెడ్డి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయంగా రూ.10వేలు పంపించి ఆదుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయ కులు శ్రీనివాసులు, గంగాధర్‌నాయుడు, రంగన్న, జమ్మన్న, బాలు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి: సీపీఎం

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఇళ్లు లేని పేదలందరికీ స్థలాలు ఇవ్వాలని సోమ వారం 17,18, 5వ వార్డులలోని సచివాలయాల్లో అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా పాతబస్తీ కార్యదర్శి రంగస్వామి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున, దాను, తిప్పన్న, ఖలీల్, కరీం, మధు పాల్గొన్నారు.

● పేదలకు ఎలాంటి షరతులు లేకుండా 2 సెంట్ల స్థలం ఇవ్వాలని సీపీఐ నగర కార్యదర్శి డి.రామక్రిష్ణారెడ్డి డిమాండ్ చేశారు. పాతబస్టాండు పెట్రోలు బంకు పక్కనే ఉన్న సచివాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పేదలు కట్టుకునే ఇళ్లకు ఇసుక, సిమెంట్ స్టీలు ఉచితంగా ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యుడు ఈశ్వర్, ఏఐవైఎఫ్ నగర అధ్యక్షుడు నాగరాజు, నాయకుడు భీముడు పాల్గొన్నారు.

కొళాయిల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలి



గ్రామస్థులతో మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనెనాయక్

సి.బెళగల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి కొళాయిల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనెనాయక్ గ్రామస్థులకు సూచించారు. సోమవారం మండలంలోని కంబందహాల్ గ్రామంలోని తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకులను ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయన వెంట సర్పంచ్ చిన్న ఈరమ్మ, ఎంపీటీసీ శోభరాణి, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పెద్దలు ఉన్నారు.

డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న డీపీవో భాస్కర్

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): నవీన పంచాయతీ కార్యదర్శుల డైరీ, క్యాలెండర్‌ను సోమవారం కర్నూలు జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు గిరిశ్రీకాంత్, మనోహర్, టీఎం నరేష్, శివశంకర్ సింగ్, జనార్దన్, రవికుమార్, శ్రీనివాసులు, మల్లికార్జున పాల్గొన్నారు.

కందులు కొనేదెప్పుడు?

● అట్టహాసంగా ప్రారంభించి.. పత్తాలేని అధికారులు ● కొనుగోలు కేంద్రం చుట్టూ రైతుల ప్రదక్షిణలు



కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అధికారులు, నాయకులు(ఫైల్)



రైతు సేవా కేంద్రం ముందు ఆందోళన చేస్తున్న రైతులు

మద్దికెర, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మద్దతు ధరతో కందులను కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. క్వింటం రూ.7,550 ప్రకారం కొనుగోలు చేస్తామని గత నెల 27వ తేదీన అధికారులు, నాయకులు కొనుగోలు కేంద్రాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. అయితే.. ఇంత వరకు మార్క్‌ఫెడ్ వారు కొనుగోలు చేయలేదు. దీంతో రైతులు ప్రతిరోజూ కొనుగోలు కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. సోమవారం రైతు సేవా కేంద్రం వద్ద నిరసన తెలిపారు. గోనెసంచులు ఉన్నా కూడా కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏఈవో రవి మాట్లాడుతూ మార్క్‌ఫెడ్ వారికి సమాచారమిచ్చామని, కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

నాలుగు రోజులుగా తిరుగుతున్నా..



కందులను అమ్ముకోవాలని నాలుగు రోజులగా రైతు సేవా కేంద్రం చుట్టూ తిరుగుతున్నా. ఇక్కడ సమాచారం ఇచ్చేవారు కూడా లేరు. **- గోపాల్, మద్దికెర**

స్థలాలు కబ్జా కాకుండా చూస్తాం

ఆదోని రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా చూస్తామని తహసీల్దార్ శివరాముడు తెలిపారు. సోమవారం మాట్లాడుతూ, ప్రభుత్వ స్థలాల వివరాలను సిబ్బంది సాయంతో గుర్తించి బోర్డులను ఏర్పాటు చేస్తామన్నారు.

ఏపీవోగా రాజునాయక్



దేవనకొండ,ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి ఏపీవోగా రాజునాయక్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. వెల్దుర్తి నుంచి దేవనకొండకు బదీలిపై వచ్చారు. వారం క్రితం కృష్ణమూర్తి బదీలి కావడంతో ఇన్‌చార్జిగా రత్నంకు బాధ్యతలు ఇచ్చారు. అనంతరం రెగ్యులర్ ఏపీవోగా రాజునాయక్‌ను నియమించారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

క్రిష్ణగిరి/పత్తికొండ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): క్రిష్ణగిరి మండలంలో యువతి అదృశ్యం కలకలం సృష్టించింది. కూతురి అదృశ్యంపై తల్లి ఫిర్యాదుచేయడంతో క్రిష్ణగిరి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదుచేసినట్లు సమాచారం. బాధితురాలి భర్త లారీ డ్రైవర్, వారం క్రితం డ్యూటీ వెళ్లాడు. ఇంటివద్ద భార్యతోపాటు పాటు ఇంటర్ చదువుతున్న కూతురు, కొడుకు ఉన్నారు. ఆదివారం రాత్రి అందరూ భోజనంచేసి నిద్రపోయారు. అయితే తెల్లవారుజామున చూడగా కూతురు కనిపించలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇంటిలో వెతికినా కనిపించలేదు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పాలకుర్తిలో డెంగీ కేసు నమోదు

● గ్రామంలో పారిశుధ్య పనులు

దేవనకొండ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలకుర్తిలో ఓ యువతికి డెంగీ నిర్ధారణ అయినట్లు మలేరియా అధికారి సాయిబాబా తెలిపారు. ఇళ్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, జ్వరం అధికంగా ఉంటే వైద్యులను సంప్రదించి రక్తపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గ్రామంలో దోమల మందు పిచికారీ చేసినట్లు సర్పంచ్ సుధారాణి, కార్యదర్శి నాగరాజు తెలిపారు.

రాజీనామాకు మేం సిద్ధం.. మరి వైసీపీ కౌన్సిలర్లు?

● మాజీ ఎమ్మెల్యేకు కౌన్సిలర్ల ప్రశ్న



మాట్లాడుతున్న బీజేపీ కౌన్సిలర్లు

ఆదోని, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కౌన్సిలర్ పదవులకు రాజీనామా చేసేందుకు తాము సిద్ధమని బీజేపీలో చేరిన కౌన్సిలర్ లలితమ్మ, పార్టీ అధికార ప్రతినిధి ఆదూరి విజయకృష్ణ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వైసీపీ నాయకులు చెప్పిన విధంగా బీజేపీ కౌన్సిలర్లు రాజీనామాకు సిద్ధంగా ఉన్నారని, ఏకగ్రీవమైన వైసీపీ కౌన్సిలర్లు కూడా ఏ రోజు రాజీనామా చేస్తారో అదే రోజు తాము చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. వైసీపీ హయాంలో కబ్జాలతో నష్టపోయిన బాధితులు ఎమ్మెల్యే పార్థసారథి వద్దకు క్యూ కట్టారన్నారు. సురేష్, నాయకులు రమాకాంత్, శ్రీనివాసాచారి, మల్లిక, వీరేష్ పాల్గొన్నారు.

వేరుశనగ ధర పతనం

● క్వింటం రూ.6,089



విక్రయానికి వచ్చిన వేరుశనగ దిగుబడులు

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం వేరుశనగ ధర పతనమైంది. క్వింటాలు ధర గరిష్ఠంగా రూ.6,089లు పలికింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర కంటే రూ.వెయ్యి తక్కువకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఈ ధర తమకు గిట్టుబాటు కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆయిల్‌ఫెడ్ ద్వారా మద్దతు ధరతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. 4,700 బస్తాలు విక్రయానికి రాగా, కనిష్ఠ ధర రూ.3,279లు కాగా, గరిష్ఠ ధర రూ.6,089 మధ్యస్థం ధర రూ. 5,669లు పలికింది.

సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వలస కూలీల పిల్లలు చదువుకునేందుకు గ్రామాల్లో సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు వినతిపత్రం సమర్పించారు. జిలాల్లలోని పశ్చిమ ప్రాంతంలో ఉపాధి లేక ప్రజలు నగరాలకు వలస వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమతో పాటు పిల్లలను కూడ తీసుకెళుతుండటంతో వారి చదువు దెబ్బతింటుందన్నారు. విద్యార్థులు వలస వెళ్లకుండా కాపాడాల్సిన బాధ్యత విద్యాశాఖ అధికారులపై ఉందన్నారు. అనీల్, హరి, గర్జప్ప పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాల గుర్తింపు రద్దు చేయాలి

పట్టణంలోని నేషనల్ నర్సింగ్ కళాశాల గుర్తింపు రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్, ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షుడు బసాపురం లింగప్ప డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. పరీక్ష ఫీజు రూ.300 ఉండగా, రూ.6వేలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కళాశాలలో బోధనా సిబ్బంది, ల్యాబ్‌లు లేకున్నా కొనసాగిస్తున్నారన్నారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేఖర్, అంజి, హుసేని, గణేష్, వీరేష్ పాల్గొన్నారు.

'కార్పొరేట్ రంగానికి కొమ్ము కాస్తున్న కేంద్రం'



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ఆదోని రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ రంగానికి కొమ్ము కాస్తుందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్ బాబు, సహాయ కార్యదర్శి నాగరా విమర్శించారు. సోమవారం మాట్లాడుతూ స్వాతంత్రానికి ముందే సాధించుకున్న 44 కార్మిక చట్టాలను మార్చి కార్మికులను కట్టు బానిసలుగా చేశారని ఆరోపించారు. ఈనెల 5న చేస్తున్న నిరసన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, కృష్ణ, సామేల్, ఈరన్న పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



మద్యం, నిందితులు, వాహనంతో ఎక్సైజ్ పోలీసులు

ఆదోని, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ సీఐ సైదూల్లా ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి దాడులు చేసి భారీగా కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ స్టేషన్‌లో విలేకరుల సమక్షంలో వివరాలు వెల్లడించారు. రూ.2లక్షల విలువ చేసే కర్ణాటక మద్యంతోపాటు బొలేరో వాహనాన్ని చూపించారు. సీఐ మాట్లాడుతూ, కర్ణాటక రాష్ట్రం శిరుగుప్ప నుంచి ఏపీ 39 టీయూ 7496 నెంబరు గల బొలేరో ట్రాలీ వాహనంలో 50 బాక్సుల మద్యాన్ని ఆస్పరి మండలం కైరుప్పులకు తీసుకెళ్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ఆదోని మండలం ఆరేకల్లు వద్ద కైరుప్పుల గ్రామానికి చెందిన ఎరుకుల మహేంద్ర, సుధీర్ కుమార్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు.

సారా బట్టీ, బెల్లం ఊట ధ్వంసం

తుగ్గలి: తుగ్గలి పరిసరల్లో ఎక్సైజ్ పోలీసులు సోమవారం సారా బట్టీలపై దాడులు చేసి బెల్లం ఊట, నాటుసారాను ధ్వంసం చేశారు. సీఐ విశ్వేశ్వరయ్య, ఎస్ఐ సాయి ప్రవీణ్ సిబ్బందితో దాడులు చేశారు. గ్రామాల్లో నాటుసారా, అక్రమ మద్యం, విక్రయాలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

బండలాగుడు పోటీలు

వెల్దుర్తి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): తిరుణాల సందర్భంగా బొమ్మిరెడ్డిపల్లె గ్రామంలో సోమవారం న్యూ కేటగిరి ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎమ్మెల్యే శ్యాంబాబు, డీఐజీ కోయ ప్రవీణ్ ప్రారంభించారు. 9 జతల ఎద్దు పోటీల్లో పాల్గొనగా, నంద్యాల జిల్లాకు చెందిన డాక్టర్ గురునాథ్ ఎద్దులు 4218.06 అడుగులు లాగి విజేతగా నిలిచాయి. కడప జిల్లాకు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి ఎద్దు రెండో స్థానంలో, నంద్యాల జిల్లాకు చెందిన గూడురు శివారెడ్డి లక్ష్మింపల్లె, సీసగుంతల ఎద్దు మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. టీడీపీ జిల్లా నాయకుడు సుబ్బరాయుడు ప్రథమ స్థానం విజేతకు రూ.50 వేలు, రెండో స్థానానికి రూ.40వేలు, మూడు, నాలుగు, ఐదో స్థానాలకు రూ.30వేలు, రూ.20 వేలు, రూ.10వేల చొప్పున అందజేశారు. మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడ్, తెలుగుయువత అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్, చెర్లకొత్తురు పుల్లయ్య, ఈదుల వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.



అభినందిస్తున్న తిక్కారెడ్డి, ఎమ్మెల్యే శ్యాంబాబు

శనగలను ఎప్పుడు కొంటారు?

మద్దికెర, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అధికారులు శనగ దిగుబడును ఎప్పుడు కొండారిన మాజీ ఎంపీపీ మల్లికార్జున యాదవ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. సోమవారం ఏవో రవితో మాట్లాడుతూ మండలంలో 20వేల ఎకరాల్లో శనగ సాగుచేశారని, పంట కోత పూర్తయి నెల అవుతుందన్నారు. గోదాముల్లో నిల్వ ఉంచడంతో ఖర్చు పెరిగిందని అలాగే కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభించినా ఇంతవరకు కొనుగోలు చేయలేదన్నారు. ఏవో రవి మాట్లాడుతూ జిల్లా అధికారులకు నివేదికలు పంపామని, ప్రభుత్వం ధర నిర్ణయించిన వెంటనే కొంటామని తెలిపారు.

వసంత పంచమి వేడుకలు



అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న దాతలు

మద్దికెర, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పెరవలి గ్రామానికి చెందిన తలారి హనుమంతరావు జడ్పీ పాఠశాలలో 1982లో పదో తరగతి పూర్తి చేశారు. సొంత నిధులు రూ.5 లక్ష లతో ఆలయాన్ని నిర్మించారు. సోమవారం వసంత పంచమి సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. 200 మంది విద్యార్థులకు పలకలు, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. విద్యాసాయి రవీంద్ర పాఠశాలలో ఎండీ వెంకట మాధవ్, ప్రిన్సిపాల్ బాల సునిత, శశికళ అక్షరభ్యాసాన్ని నిర్వహించారు.

కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి మొండిచేయి

దేవనకొండ: కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి మొండిచేయి చూపారని సీపీఎం నాయకులు అశోక్, యూసుఫ్ బాషా ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం బస్టాండ్ ఆవరణలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

ఆరోగ్యం మన చేతుల్లోనే..

వెల్దుర్తి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు అన్నారు. సోమవారం రామళ్లకోట పీహెచ్‌సీ పరిధిలోని వెల్దుర్తి సచివాలయంలో సంచార చికిత్స సేవలను కొన్ని వ్యాధులు రాకుండా ఉండాలంటే జీవనశైలిలో మార్పులు చేసుకోవాలని సూచించారు. డాక్టర్ ప్రతిభ, మెడికల్ అధికారి కృష్ణమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రకృతి' కూరగాయల విక్రయం

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయ ఆవరణలో ప్రకృతి ఉత్పత్తుల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. మండలంలోని దేవనబండ, జూటూరు తదితర గ్రామాల్లో రైతు సాధికార సంస్థ వ్యవసాయ శాఖ పర్యవేక్షణలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన క్యారెట్, ముల్లంగి, టమోటా, ఆకుకూరల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు.

వైద్య రంగంలో మహిళది కీలకపాత్ర

దేవనకొండ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వైద్యరంగంలో మహిళలది కీలకపాత్రని డాక్టర్ అరుణజ్యోతి అన్నారు. జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం సందర్భంగా సిబ్బంది సన్మానించారు. మహిళల ఆరోగ్య సమస్యలను మహిళా వైద్యులు మెరుగ్గా పరిష్కరించగలరన్నారు. సూపర్‌వైజర్లు హనుమంతమ్మ, ఏఎన్ఎం మాదమ్మ తదితరులు ఉన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

● ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటరమణి



హాలహర్వి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో రానున్న వేసవిలో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకుం టున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటరమణి అన్నారు.

ప్రశ్న: మండలంలో తాగునీటి పథకాలు ఎన్ని ఉన్నాయి? వాటి నిర్వహణ ఎలా ఉంది?

జవాబు: చింతకుంట, బాపురం, విరుపాపురంలో మూడు తాగునీటి పథకాలు ఉన్నాయి. వాటిని కాంట్రాక్టర్ల నిర్వహణలో పర్యవేక్షిస్తాం

ప్రశ్న: తాగునీటి నిల్వలు ఎలా ఉన్నాయి?

జవాబు: ఎల్లెల్సీలో నీరు పుష్కలంగా ఉంది. జలాశయాలు నిండుగా ఉన్నాయి. తాగునీటి ఇబ్బంది లేదు.

ప్రశ్న: చింతకుంట జలాశయం నుంచి చాలా గ్రామాలకు తాగునీరు అందడం ప్రజలు అంటున్నారు?

జవాబు: చింతకుంట జలాశయం పూడికతో నిండిది. తాగునీరు తక్కువగా ఉండటంతో పూర్తిస్థాయిలో నీరు ఇవ్వకపోతున్నాం.

ప్రశ్న: పూడిక తొలగించేందుకు చర్యలు తీసుకున్నారా?

జవాబు: చింతకుంటలో మరో జలాశయం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపాం. త్వరలో నిధులు మంజూరు చేస్తామని ఉన్నతాధికా రులు హామి ఇచ్చారు.

ప్రశ్న: కార్మికులకు వేతనాలు అందడం లేదని ఆందోళన చేస్తున్నారు కదా?

జవాబు: ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వడంలేదని మా దృష్టికి వచ్చింది. త్వరలో అందేలా చూస్తాం.

ప్రశ్న: శుద్ధి చేయకుండానే తాగునీటిని వదులుతునానరని గ్రామస్థులు ఫిర్యాదు చేస్తున్నారు?

జవాబు: ఎప్పటికప్పుడు పర్యవేక్షించి శుద్ధి చేసిన నీటిని గ్రామాలకు అందించేందుకు చర్యలు తీసుకుంటాం. నీరు కలుషితం కాకుండా చూస్తాం.

ప్రశ్న: గ్రామాల్లో తాగునీటి పైపులైన్లు పగిలిపోయి తాగునీరు రావడం లేదని గ్రామస్థులు అంటున్నారు.?

జవాబు: పైపులైన్లు విద్యుత్ మోటార్ల బాధ్యత కాంట్రాకర్లదే. మా దృష్టికి వచ్చిన వెంటనే మరమ్మతులు చేయిస్తాం.

బంగారు అంబారీపై ప్రహ్లాదరాయలు



బంగారు అంబారీపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు బంగారు అంబారీపై భక్తులకు దర్శనం ఇచ్చారు. సోమవారం మాఘమాసం వసంత పంచమి శుభదినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి, మంచాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెండి గజవాహనంపై స్వర్ణ అంబారీలో ప్రహ్లాదరాయలను అధిష్టించి పీఠాధిపతి మహామంగళహారతితో ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

ముగిసిన జంబులా పరమేశ్వరి ఉత్సవాలు



ఎమ్మెల్యే బీవీని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

నందవరం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముగతి గ్రామంలో సోమవారం జంబులా పరమేశ్వరి ఉత్సవాలు ముగిశాయి. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభం ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. టీడీపీ నాయకులు, మాజీ జడ్పీటీసీ ముగతి ఈరన్నగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించగా ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరరెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యేకు గ్రామ పెద్దలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన జంబులా పరమేశ్వరీకి ప్రత్యేక పూజలు చేశారు కార్యక్రమానికి మంత్రాలయం పనుపుల శివచంద్రస్వామి బలకుంది నటరాజశాస్త్రి, టీడీపీ నాయకులు కర్నూలు ఈరన్నగౌడు, కాపు వీరారెడ్డి, బార్గవ్‌యాదవ్ పాల్గొన్నారు.

రామలింగేశ్వర స్వామికి వెండి విరాళం



వెండి పూజా సామగ్రిని విరాళం ఇస్తున్న దాతలు

మంత్రాలయం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పాతూరిలో వెలసిన రామలింగేశ్వరస్వామికి మంత్రాలయం టెంకాయల వ్యాపారి శేఖర్ కేజీ వెండి దీపాలు, వీరభద్ర, రుద్రప్ప కుమారులు పరమేశ్‌గౌడు, సోమనాథ్‌గౌడు 300 గ్రాముల వెండి, ఇంజనీర్ వెంకటేష్ 300 గ్రాముల వెండి పూజా సామగ్రి విరాళంగా అందజేశారు. సోమవారం కుటుంబ సమేతంగా వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు చేసి ఆలయ అర్చకులు వీరేష్ స్వామికి విరాళాన్ని అందజేశారు. దాతలను అర్చకులు హంపయ్యస్వామి, సిద్ధలింగయ్యస్వామి, చంద్రన్నగౌడు తీర్థప్రసాదాలను శేషవస్త్రం అందజేశారు.

బాధిత కుటుంబాలకు ఉద్యోగం ఇవ్వాలి



జేసీకి వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని మున్సిపల్ పరిధిలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తూ మృతి చెందిన కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలులో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ నవ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణంలోని 34 వార్డుల్లో పని చేసేందుకు కార్మికులు అవసరం ఉన్నా స్థానిక మున్సిపల్ కమిషనర్ పట్టించుకోవడంలేదన్నారు. ఈ విషయంపై ఎన్నిసార్లు కమిషనర్‌ను కలిసినప్పటికి అనంతపురం డీఎం కార్యాలయానికి పంపించామని చెప్పుకుంటూ చేతులు దులుపుకుంటున్నారన్నారు. మృతి చెందిన పారిశుధ్య కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, తిమ్మగురుడు, శివ, బాధిత కార్మిక కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పుష్కరిణి పనులకు భూమి పూజ



పనులను ప్రారంభిస్తున్న కాంట్రాక్టరు ఓబులయ్య, ఇంజనీర్ శ్రీనివాసులు

మంత్రాలయం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి సన్నిధానంలో రూ.2.8 కోట్లతో పుష్కరిణి పనులకు శ్రీకారం చుట్టారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆదేశాల మేరకు సోమవారం మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్ సురేష్ కోనాపూర్ ఆధ్వర్యంలో కాంట్రాక్టరు ఓబులయ్య, సైట్ ఇంజనీర్ ఉబ్బ శ్రీనివాసులు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. మంచాలమ్మ గుడి సమీపంలో బృందావన్ గార్డెన్ ముందు 165 అడుగుల పొడవు, 70 అడుగుల వెడల్పు, ఏడున్నర అడుగుల లోతుతో పుష్కరిణి పనులు చేపడుతున్నారు. పనులు పూర్తయితే మంత్రాలయానికి తెప్పోత్సవం, భక్తులకు తలపై నీళ్ల చల్లుకునేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు మఠం అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ బద్రినాథ్, శ్రీహరి, సూపర్‌వైజర్ గురుదాసు, నాగరాజు, హనుమంతు, రాఘవేంద్ర, శ్రీరాములు, హనుమంతు, అంజినేయ, వీరన్న పాల్గొన్నారు.

ఎల్లెల్సీకి తగ్గిన నీటి మట్టం

- 175 క్యూసెక్కులకు గాను 53కు పడిపోయిన ప్రవాహం
- కోడుమూరు సెక్షన్‌కు 10 క్యూసెక్కులు విడుదల
- గోనెగండ్ల పంట కాలువలకు, తాగునీటికి 43 క్యూసెక్కుల నీరు



గోనెగండ్ల సెక్షన్ ఎల్లెల్సీలో తగ్గిన నీటి మట్టం

గోనెగండ్ల, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాం నుంచి ఎల్లెల్సీ కాలువకు విడుదల అయ్యే నీరు గతవారం రోజులుగా తగ్గించారు. కర్ణాటక ప్రాంతంలో రైతుల మరో పంట సాగు చేసుకునేందుకు నీటిని వాడుకుంటున్నట్లు సమాచారం. దాంతో ఆంధ్రకు వచ్చే నీటి మట్టం తగ్గినట్లు తెలుస్తోంది. రబీ సీజన్‌లో గోనెగండ్ల సెక్షన్‌కు 175 క్యూసెక్కుల నీరు విడుదల కావాల్సి ఉంది. అయితే కేవలం 53 క్యూసెక్కుల నీరు మాత్రమే విడుదల అవుతుంది. కాలువలో నీటి మట్టం పడిపోవడంతో గోనెగండ్ల సెక్షన్ ఇరిగేషన్ అధికారులు కోడుమూరుకు 10 క్యూసెక్కులు విడుదల చేసి మిగిలిన 43 క్యూసెక్కులను గోనెగండ్ల సెక్షన్‌లోని పంటకాలువలకు, తాగునీటి పథకాలకు విడుదల చేసుకుంటున్నారు. నీటి మట్టం పడిపోవడంతో కొన్ని రోజులు క్రితం గాజుల దిన్నె ప్రాజెక్టుకు ఎల్లెల్సీ నీటిని మళ్లించే ఇరిగేషన్ అధికారులు నిలుపి వేశారు. దీంతో గాజులదిన్నె ప్రాజెక్టులో ప్రస్తుతం 2.2 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఎల్లెల్సీనీరు జీడీపీలో నిలువ ఉంచితేనే వచ్చే వేసవిలో తాగునీటి పథకాలను నీరు అందుతుంది. లేకపోతే వచ్చే వేసవిలో గాజులదిన్నె ప్రాజెక్టు కింద ఉన్న బండగట్టు, డోన్, క్రిష్ణగిరి, కోడుమూరు, కర్నూలు, గూడురు, సి.బెళగల్ ప్రాంతాల నీటి పథకాలకు ఇబ్బందులు తప్పవు. గాజులదిన్నె ప్రాజెక్టు కింద ఈ ఏడాది 14000 ఎకరాలు సాగు అవుతుంది. ప్రాజెక్టులో ఉన్న నీరు పొలాలకు సరిపోతే ఇక తాగునీటి పథకాలకు ఇబ్బందులు తప్పవని పరిశీలకులు భావిస్తున్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

- జైభీమ్ ఎమ్మార్పీఎస్ నాయకుల డిమాండ్
- రాఘవేంద్ర సర్కిల్‌లో బైఠాయించి నిరసన



రాఘవేంద్ర సర్కిల్‌లో జైభీమ్ ఎమ్మార్పీఎస్ నాయకుల నిరసన

మంత్రాలయం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): శ్మశాన స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని జైభీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిక్కెం జానయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్న డిమాండ్ చేశారు. సోమవారం రాఘవేంద్రసర్కిల్‌లో నాలుగు రోడ్లను దిగ్బంధించారు. దాంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ సందర్భంగా చిక్కెం జానయ్య మాట్లాడుతూ మండలంలోని చెట్నహళ్లి గ్రామంలో 113 సర్వేనెంబరులోని 1.50 ఎకరాల భూమిని శ్మశానానికి కేటాయించారని, దాని రద్దు చేసి దళితులకు ఇళ్ల స్థలాలుగా ఇచ్చారన్నారు. శ్మశానానికి 125, 126 సర్వే నెంబరులో 3.5 ఎకరాలు కేటాయించగా, దాని గ్రామానికి చెందిన పెద్ద హంపయ్య, పెద్ద బసన్నగౌడు, తెలుగు భీమయ్య కబ్జా చేశారన్నారు. దాంతో శవాలను దళితుల ఇళ్ల సమీపంలో ఖననం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శ్మశాన స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 113 సర్వేలోని 1.50 ఎకరాల స్థలంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ రవికి వినతి పత్రం ఇచ్చారు. కబ్జాకు గురైన స్థలాన్ని శ్మశాన వాటికకు కేటాయించాలని, లేకపోతే జైభీమ్ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రత్నం, యోహాన్, అజయ్, అంజినేయ, రాజు, ఈరన్న, నరసింహులు, ఏసేబు, పుల్లయ్య, తిక్కయ్యప్రకాష్‌జాన్, నరసన్న, వినోద్, దేవేంద్రలు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేసే వరకు పోరాటం



ఎమ్మిగనూరులో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఇళ్ల స్థలాలు మంజూరు చేసేవరకు పోరాటం చేస్తామని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి శ్రావణి, సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న అన్నారు. సోమవారం ఎమ్మిగనూరు పట్టణంలో దాదాపు 300 మంది మహిళలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం చేరుకొని తహసీల్దార్ శేషఫణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణంలో రెండు సెంట్ల స్థలం ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. రాష్ట్ర కేబినెట్‌లో మాత్రం తీర్మానం చేసి చేతులు దులుపుకుందన్నారు. వెంటనే ఇంటి స్థలాలు ఇచ్చే తేదీని ప్రకటించాలన్నారు. గతంలో పేదలకు జగన్మోహన్‌రెడ్డి ఒకసెంటు ఇచ్చినట్లు చెప్పుకుంటున్నాడని విమర్శించిన కూటమి నాయకులు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. రాష్ట్రంలో ఇళ్లులేక ఎంతో మంది పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు భాస్కర్‌యాదవ్, సమీఉల్లా, కేసీ జబ్బార్, దాదావలి, విజయేంద్ర, మల్లికార్జున, ఖాజా, బాషా, మహిళా సమాఖ్య నాయకులు హసీనా, వెంకటలక్ష్మి, చాముండి, ఈరమ్మ, లక్ష్మీ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో విఫలం

పెద్దకడుబూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలు పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయులు ఆరోపించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల రైతులు భూ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ఎందుకు అధికారులు పట్టించుకోవడంలేదన్నారు.

నేడు కాశీ విశ్వేశ్వర స్వామి కల్యాణం

గోనెగండ్ల, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): గోనెగండ్లలోని వీవర్స్ కాలనీలోని కాశీ నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పార్వతీ, కాశీనీలకంఠేశ్వరస్వామికి కల్యాణం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఉదయం 9గంటలకు నవగ్రహపూజ, నిర్మలాభిషేకం, 10 గంటకు పంచామృతాభిషేకం, అలంకరణ, మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారి కల్యానం, అనంతరం పల్లకోత్సవం, ఒంటి గంటకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



మాట్లాడుతున్న విజేంద్ర

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఈనెల 5న చేపట్టనున్న దేశవ్యాప్త నిరసనను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ప్రసాద్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్త నిరసనలో రైతులు, కార్మికులు, హమాలీలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ నాయకులు రాముడు, విజేంద్ర, అబ్దుల్లా, రాజు, గిరి, నరసయ్య, కృష్ణ పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం



కందుల కొనుగోలును ప్రారంభిస్తున్న ఏవో

గోనెగండ్ల, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో సోమవారం డీసీఎంఎస్, ఏపీ మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏవో హేమలత, డీసీఎంఎస్ సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కందులకు కనీస మద్దతు ధర రూ. 7550 ప్రకారం రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఖరీఫ్‌లో కంది పంటను సాగు చేసి ఈక్రాప్‌లో పేర్లు నమోదు చేసుకున్న వారి నుంచి మాత్రమే ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి, మాజీ సర్పంచ్ రంగముని, టీడీపీ నాయకులు నజీర్, తిరుపతయ్య, రమేష్ నాయుడు, బీజేపీ నాయకులు మునిస్వామిగౌడ్, ఏఈవో అరుణకుమారి, పులిరాజు, మహేంద్ర, షఫీ, రాజ్యలక్ష్మి, చైతన్యలక్ష్మి రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయల స్టాల్‌ను ఏర్పాటు చేసిన రైతులు

గోనెగండ్ల, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటలకు, కూరగాయలతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని మండల వ్యవసాయ శాఖ అధికారి హేమలత అన్నారు. సోమవారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని వ్యవసాయ శాఖ కార్యాలయం దగ్గర రైతు సాధికార సంస్థ, ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏవో హేమలత మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలలో నాణ్యత ఉంటుందన్నారు. గోనెగండ్ల మండలంలో రెండు యూనిట్లు పని చేస్తున్నాయన్నారు. గాజులదిన్నె యూటిట్ కింద నాలుగు గ్రామాలు, వేముగోడు యూనిట్ కింద రెండు గ్రామాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జిలు రైతులు పాల్గొన్నారు.

ఈరన్న స్వామి సన్నిధిలో ప్రముఖులు





స్వామి వారి పూజల్లో పాల్గొన్న తిక్కారెడ్డి, కేఈ శ్యాంబాబు, వివిధ మఠాల పీఠాధిపతులు, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి

కౌతాళం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపట్టిన మహాకుంభాభిషేక కార్యక్రమానికి సోమవారం వివిధ పార్టీలకు చెందిన రాజకీయ ప్రముఖులు హాజరై స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శాంబాబు ఉత్సవాలకు రాగా ఆలయ డీసీ మేడిపల్లి విజయరాజు, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. మధ్యాహ్నం ఎమ్మెల్సీ బీటీ నాయుడు, మంత్రాలయం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి, మంత్రాలయం మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, కర్ణాటక రాయచూరు రూరల్ ఎమ్మెల్యే దద్దల బసవన్నగౌడ్, ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి కుటుంబ సమేతంగా హాజరై స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు.

కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప, జిల్లా కార్యనిర్వహణాధికారి కోట్రేష్‌గౌడ్, తెలుగు వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షుల భరద్వాజ్ శెట్టి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు అమర్నాథరెడ్డి, నాయకులు విజయరామి రెడ్డి, కురుగోడు, సిద్దు, రాజబాబు, రవితేజ శెట్టి, బాలయ్య ఫ్యాన్స్ రెహమాన్, రామకృష్ణారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు ఉలిగయ్య, వెంకటపతిరాజు, అడివప్పగౌడ్, వైసీపీ నాయకులు నాగరాజుగౌడ్, ప్రదీప్‌రెడ్డి, ప్రహ్లాద చారి, అనిల్ కుమార్ ఉన్నారు.

15న ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : ఎస్ఎఫ్ఐ 48వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి విజయ్ కుమార్ కోరారు. స్థానిక ఎస్ఎంఎల్ డిగ్రీ కళాశాలలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15న ఆదోనిలో 48వ ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వినోద్, డ్యాని, నరేంద్ర పాల్గొన్నారు.

మిరప రైతులను ఆదుకోవాలి

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మిరప రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్ఆర్‌సీపీ పట్టణ నాయకుడు గడ్డం నారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో గడ్డం నారాయణ రెడ్డి మాట్లాడుతూ మిరపకు ఎర్ర తెగులు, గులాబీ పురుగు వంటి తెగుళ్ల సోకడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. పెట్టుబడి కూడా రాలేని పరిస్థితి దాపురించిందన్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన మిరప రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు.

రేపు యూత్ బాస్కెట్ బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో అండర్-16 యూత్ బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు బుధవారం ఉదయం 10 గంటలకు జరుగుతాయని బాస్కెట్‌బాల్ సంఘం ప్రతినిధి దాదాబాసా సోమవారం తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు పీఠాపురంలో ఈ నెల 8, 9, 10 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని, ఎంపికకు హాజరయ్యే విద్యార్థులు 1.1.2009 తర్వాత జన్మించిన వారై ఉండాలని అన్నారు. వివరాల కోసం 9985161007ను సంప్రదించాలని సూచించారు.

- **మహిళా హాకీ ఎంపిక పోటీలు:** నంద్యాల ఎస్‌పీజీ హైస్కూల్‌లో సీనియర్ మహిళల హాకీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి దాసరి సుధీర్ తెలిపారు. క్రీడాకారులు 1996 తర్వాత పుట్టిన వారై ఉండాలన్నారు. వివరాలకు 9966565317ను సంప్రదించాలని సూచించారు.

లక్ష డప్పుల కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కోసిగి ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): హైదరాబాదులో ఈనెల 7న జరిగే లక్ష డప్పులు, వేల గొంతుల సభను జయప్రదం చేయాలని ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షులు సూర్యపోగు చిన్న దుర్గప్ప అన్నారు. సోమవారం కోసిగిలో హలో మాదిగ.. చలో హైదరాబాదు.. లక్ష డప్పులు, వేల గొంతుల కార్యక్రమం పోస్టర్‌ను విడుదల చేశారు. ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి హనుమంతు, అధికార ప్రతినిధులు నరసింహులు, కొట్టాల ప్రభాకర్, కోడి ఉరుకుందప్ప, నరసింహులు, యోహాన్, హనుమంతు, సామేల్ పాల్గొన్నారు.

గోనెగండ్ల: ఎస్సీ వర్గీకరణ ఎమ్మార్పీఎస్‌తోనే సాధ్యమైందని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మహదేవ్ అన్నారు. సోమవారం గోనెగండ్లలో ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహదేవ్ మాట్లాడుతూ ఈ నెల 7న హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో చేపట్టిన లక్షల డప్పులు వేల గొంతుకల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సి బాధ్యత మాదిగలపై ఉందన్నారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టల్స్‌ను విడుదల చేశారు. గాజులదిన్నె సీమోన్, మారెప్ప, గిరిబాబు, సుంకన్న, మోహన్, బేతాళబాషా, దేవరాజు, రంగస్వామి పాల్గొన్నారు.

ఉరుకుందకు పోటెత్తిన వాహనాలు

కోసిగి ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఉరుకుంద క్షేత్రంలో వెలసిన శ్రీనరసింహ ఈరన్న స్వామి ఆలయంలో మహా కుంభాభిషేకం సందర్భంగా సోమవారం కోసిగి మీదుగా వాహనాలు అటువైపు పోటెత్తాయి. నాలుగు రోజుల నుంచి ఉరుకుంద ఈరన్నస్వామి క్షేత్రంలో మహా కుంభాభిషేకం, ఆలయ గోపుర కలశ ప్రతిష్ఠ నిర్వహిస్తున్నారు. సోమవారం ఏపీ, కర్ణాటక, తెలంగాణ తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మహా కుంభాభిషేకం కార్యక్రమానికి భక్తులు తరలి వెళ్లారు.

'ప్రజలకు అందుబాటులో ఉండాలి'

సి.బెళగల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో రాణెమ్మ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. ఈవోఆర్డీ ఈశ్వరస్వామి పాల్గొన్నారు.